ఈనాడు
వికారాబాద్
బుధవారం 23 ఆగస్టు 2017 16 పేజీలు

నాణ్యత... కరవై కలతే!

యావత్ సమాజానికి మేలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంతో చెరువుల పునరుద్ధరణను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. నిధుల మంజూరుకు వెనక్కి తగ్గకుండా జలాశయాల బాగుకు నడుం బిగించింది. పనులు బాగా చేసినచోట సత్ఫలితాలు వస్తుండగా మరికొన్నిచోట్ల నాణ్యత పాటించకుండా నిర్వహిస్తుండటంతో వృథా ప్రయాసగా మారుతోంది. నిధులు నిరుపయోగమవుతుండగా ప్రభుత్వ లక్ష్యానికి గండిపడేలా చేస్తున్నారు. తాండూరు మండలంలో మూడవవిడత మిషన్ కాకతీయలో భాగంగా రూ.47.62 లక్షల ఖర్చుతో చేపట్టిన రెండు చెరువు పునరుద్ధరణ పనులపై 'న్యూస్‌టుడే' కథనం...

- నాసిరకంగా చెరువుల పునరుద్ధరణ
- మరమ్మతులపై కొరవడిన పర్యవేక్షణ
- రూ.47.62 లక్షల పనుల్లో ఇష్టారాజ్యం



రాంపూర్‌లోకి కింది చెరువు కట్టపై నెలరోజుల్లోనే పగుళ్లు



బెల్కటూరులో బొబ్బిలోనికుంట కట్టకు మట్టి పెళ్లలు ఇలా..

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

తాండూరు మండలం బెల్కటూరులో బొబ్బిలోని కుంట మరమ్మతులకు రూ.17.72 లక్షలు, రాంపూర్‌లోని కిందిచెరువు పునరుద్ధరణకు రూ.29.9 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. బొబ్బిలోనికుంట చెరువు కట్టపై మట్టిని వేసి వదిలేశారు. ప్రస్తుతం చెరువు కట్ట వారగా మట్టి పెళ్లలు దర్శనమిస్తున్నాయి. కట్ట పైన కూడా ఎత్తుపల్లాలుగా మారింది. దీంతో కట్ట మీదుగా వెళ్తుంటే వేగనిరోధకాల పైనుంచి వెళ్తున్న భావన కలుగుతోంది. తూము వద్ద చేపట్టిన సిమెంటు పనుల్లోనూ అవసరమైనంత సిమెంటు మిశ్రమం వాడకపోవడంతో కంకర బయటకు తేలింది. పనుల్లో నాణ్యతపై ఆయకట్టు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కట్టపై రోలరుతో తొక్కించి ఎత్తుపల్లాలను సరిచేయాలని కోరుతున్నారు. కట్ట పక్కభాగంలోనూ మట్టిపెళ్లలను సరిచేసి కట్టను బలోపేతంగా నిర్మింపజేయాలని సూచిస్తున్నారు. లేదంటే ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించిన మరమ్మతులు చేయించిన తమకు ఫలితం లేకుండాపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాంపూర్ కట్టపై అప్పుడే పగుళ్లు

తాండూరు మండలం రాంపూర్‌లో కిందిచెరువు మరమ్మతులను వేసవి కాలంలో ప్రారంభించడంతో పరిసరాల్లోని రైతులు సంబరపడ్డారు. తీరా పనులు మొదలయ్యాక ఇస్టానుసారంగా చేస్తుండటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట నిర్మించిన నెల రోజుల్లోనే అనేకచోట్ల పగుళ్లు వచ్చాయి. కట్టకు రెండువైపులా బీటలు పడటంతో నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కట్ట పైభాగంలోనూ పగుళ్లు ఏర్పడటంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఇంకా సిమెంటు పనులు మొదలు కాకముందే కట్ట ఇలా దెబ్బతినడం ఏమిటని వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అలుగు గోడలు కూలి రాళ్లు కిందపడగా వాటిని ఇంకా సరిచేయనే లేదు. దశాబ్దాల క్రితం నిర్మించిన తూముకు సైతం మరమ్మతులు ప్రారంభించలేదు. చేసిన పనుల్లో నాణ్యతాలోపం, యాభైశాతం వరకు పనులు పూర్తిచేయని ఫలితంగా మిగతా 7 లో...

తపాలా కినుక... పింఛన్లు అందక!

- 90 వేల మంది లబ్ధిదారుల పడిగాపులు
- పోస్టల్ సిబ్బంది సమ్మెతో ఇబ్బందులు



నవాబుపేట తపాలా కార్యాలయంలో వేచి ఉన్న మహిళలు, వృద్ధులు

సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు తిప్పలు తప్పడంలేదు. వృద్ధాప్య, వితంతువు, వికలాంగ, నేత, గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటున్న విషయం తెలిసిందే. ఈ పింఛను మొత్తాలను నెలనెలా లబ్ధిదారులకు చేరవేయడంలో తపాలా శాఖ సిబ్బందిదే కీలకపాత్ర. ప్రస్తుతం తపాలా సిబ్బంది సమ్మెలో ఉన్నారు. దీంతో ఈ నెల చివరి వారానికి చేరుకున్నా పింఛను ఇప్పటి వరకు అందలేదు. ప్రస్తుతం రూ.9 కోట్ల మొత్తం బ్యాంకు ఖాతాల్లోనే మూలుగుతోంది. ఇవీ వివరాలు....

వికారాబాద్:
న్యూస్‌టుడే, నవాబ్‌పేట్

వికారాబాద్ జిల్లాలో మొత్తం 1,05,375 మంది పింఛన్లు పొందుతున్నారు. ఒక్కో విభాగంలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అందిస్తున్నారు. మొత్తంగా లబ్ధిదారులకు నెలకు రూ.12 కోట్ల వరకు చెల్లిస్తున్నారు. వికారాబాద్, తాండూరు పురపాలక సంఘాల్లో మినహా మిగిలిన 374 గ్రామ పంచాయతీల్లోనూ తపాలా శాఖ సిబ్బంది(మేనేజర్, బి.పి.ఎం) ఆధ్వర్యంలోనే పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని తపాలా కార్యాలయాల్లో 173 మంది మేనేజర్లు ఉన్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రతి బీపీఎంకు ఆధార్‌తో అనుసంధానమైన బయోమెట్రిక్ యంత్రాలను అందించారు. వీరికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు. లబ్ధిదారులు వచ్చి ఈ యంత్రంలో వేలి ముద్ర వేస్తే పింఛను చెల్లిస్తారు. బయోమెట్రిక్ యంత్రంలో వేలి ముద్రలు పడని, సరిపడని వారికి గ్రామ పంచాయతీ కార్యదర్శి, తపాలా శాఖ మేనేజర్‌లు సంయుక్తంగా కలసి అందించేందుకు అవకాశం కల్పించారు. రెండు పురపాలక సంఘాల పరిధిలో బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరచి అందులో పింఛను మొత్తాన్ని మిగతా 7 లో...

రైతు కుటుంబాలకు అండదండలు



మాట్లాడుతున్న పాలనాధికారిణి దివ్య, చిత్రంలో డీఆర్‌ఓ సంధ్యారాణి, డీఆర్‌డీఓ జాన్సన్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి హనుమంతరావు తదితరులు

- ఆత్మహత్యల బాధితులను ఆదుకుంటాం
- నష్టపరిహారం ఒకేసారి చెల్లించేందుకు చర్యలు

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: రైతుల ఆత్మహత్యలకు సంబంధించి, బాధిత కుటుంబాలకు పరిహారాన్ని ఒకేసారి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పాలనాధికారిణి దివ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్‌లోని పరిపాలనా కార్యాలయంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబ సభ్యులు, అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాధిత రైతు కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కుటుంబ యజమాని ఆత్మహత్యకు పాల్పడితే భార్యకు వితంతువు పింఛను ఇచ్చేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. అంత్యోదయ పథకం మిగతా 7 లో...

సమయానికి స్పందించరు.. సమస్య పరిష్కరించరు!

☛ విద్యుత్ తీగలకు అల్లుకుంటున్న చెట్ల తీగలు ☛ పొంచి ఉన్న ప్రమాదాలు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే:

★ ముజాహిద్‌పూర్ సమీపంలో రైతుల పంట పొలాల్లో ఉన్న నియంత్రిక దగ్గర చెట్ల తీగలు అల్లుకున్నాయి. దీంతో రైతులు పొలం పనుల నిమిత్తం అటు వైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

★ రాంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్ళే దారిలో రోడ్డుకు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి పొడవునా తీగలు అల్లుకుని ఉన్నాయి. చెట్ల తీగలు విద్యుత్ తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

★ బండవెల్కిచర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్ నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో ఆన్ ఆఫ్ చేయడానికి నియంత్రిక దగ్గరకు వెళ్ళలేని పరిస్థితి ఉంది.

★ సాల్వీడ్‌లో నియంత్రిక చుట్టూ చెట్ల తీగలు అల్లుకుని ఉన్నాయి. అంతేకాకుండా నియంత్రిక ఏర్పాటు చేసిన దిమ్మె కూడా శిథిలావస్థకు చేరుకుని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థ నిర్వహణకు తీరుగా నిలుస్తున్నాయి ఈ ఉదాహరణలు.



ముజాహిద్‌పూర్ సమీపంలో ప్రమాదకరంగా నియంత్రిక



రాంరెడ్డిపల్లిలో స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలు

పట్టించుకునే వారేరీ...

విద్యుత్ ప్రమాదాలు, ప్రమాదకరంగా మారిన తీగలు వంటి సమస్యలపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారు కరవయ్యారు. సంవత్సరాలు గడిచిపోతున్నా వినియోగదారుల సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. దీంతో నానా ఇబ్బందులు మధ్యన రైతులు, వినియోగదారులు నెట్టుకొస్తున్నారు. జిల్లాలో 18 మండలాలు ఉండగా 367 గ్రామ పంచాయతీలున్నాయి. వేలాడుతున్న తీగలు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, నియంత్రికల దిమ్మెలు ఇవన్నీ గ్రామీణ ప్రాంతాలలో నిత్య కృత్యంగా కనిపిస్తున్న విద్యుత్ సమస్యలు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. కుల్కచర్ల మండలంలో 24 గ్రామ పంచాయతీలు 100కు పైగా గిరిజన తండాలు ఉన్నాయి. గ్రామాలలో విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నాయి. వర్షాకాలంలో ఈ సమస్యలకు భిన్నమైన సమస్యలు మరి కొన్ని ఏర్పడుతున్నాయి. నియంత్రికలు ఎక్కువగా చెట్లు, పొదల మధ్యన ఉండటంతో అక్కడ ఉన్న చెట్ల తీగలు నియంత్రికలు, విద్యుత్ తీగల చుట్టూ అల్లుకుంటున్నాయి. ప్రమాదకరంగా విద్యుత్ తీగలు మారుతున్నాయని విద్యుత్ అధికారులకు తెలియపరిచినా ఎలాంటి ఫలితం లేదంటున్నారు మండల ప్రజలు. విద్యుత్ బిల్లుల వసూళ్ళల్లో ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కరించడంలో చూపితే బాగుంటుందని ఆయా గ్రామాల ప్రజలు పలువురు కోరుతున్నారు.

ఎక్కడికక్కడే...

విద్యుత్ అధికారులు సరైన సమయంలో ప్రత్యేక చొరవ తీసుకోకపోవడంతో సమస్యలన్నీ ఎక్కడికక్కడే కనిపిస్తున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కుల్కచర్ల, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో పలుచోట్ల నియంత్రికలు, విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలో ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన కనీస చర్యలు కూడా అధికారులు చేపట్టడం లేదని పలువురు వినయోగాదారులు వాపోతున్నారు. దీంతో సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు తప్పడం లేదు. తీగలు ప్రమాదకరంగా మారుతున్నాయని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని విద్యుత్ సిబ్బందికి విన్నవించినా తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత హడావుడి చేసే కన్నా ముందస్తు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటే బాగుంటుందంటున్నారు.

మూగ జీవాలు మృత్యువాత పడే అవకాశం....

నియంత్రికలు తీగల చుట్టూ చెట్లు, పిచ్చి మొక్కలు పెరుగుతుండటంతో మూగ జీవాలు మృత్యువాత పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నియంత్రికలు కనిపించకుండా తీగలు అల్లుకోవడం వలన ఆకులను మేయడానికి మేకలు, పశువులు వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో సాల్వీడ్ గ్రామంలో మేకలు మేత తింటూ నియంత్రిక పరిసరాల్లోకి వెళ్ళి మృత్యు వాత పడ్డాయి. ప్రతి సంవత్సరం తరచుగా మూగ జీవాలు మృత్యు వాత పడుతున్నా కూడా విద్యుత్ అధికారుల్లో మాత్రం ఏ మాత్రం చలనం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. కనీసం ఇప్పుడైనా స్పందించి అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బీజేవైఎం నూతన కార్యవర్గం

పరిగి, న్యూస్‌టుడే: భారతీయ జనతా యువమోర్చా నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం భాజపా జిల్లా కార్యదర్శి రాంచందర్, మండల అధ్యక్షుడు పెంటయ్యగుప్త, బీజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. మండల శాఖ అధ్యక్షునిగా కె.శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులుగా జోగు రమేష్, ఇ. రమేష్, ఉపాధ్యక్షులుగా ఇ.అరవింద్, ఎం.సాయికిరణ్, ఆర్.కృష్ణయ్య, ఎం.మహేష్, కార్యదర్శులుగా ఇ.రాము, బి.మనోజ్‌కుమార్, బి.మోహన్‌రెడ్డి, వై.భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా డి.రాజు, కార్యవర్గ సభ్యులుగా రాఘవేందర్, జనార్ధన్, శేఖర్ ఎన్నికయ్యారు.



కె.శ్రీశైలం



జె.రమేష్

రాయితీ గొర్రెల మృత్యువాత

పూడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెద్దఉమ్మెంతాల్‌లో ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన గొర్రెలు మృత్యువాత పడుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల సమక్షంలో కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 10 రోజుల కిందట గొర్రెలు కొనుగోలు చేసుకుని గ్రామానికి తీసుకు వచ్చారు. దీంతో మేత సక్రమంగా మేయలేదని నాలుగు రోజులుగా కొన్ని అనారోగ్యానికి గురైనట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన అంజయ్య గుంపులో ఒక గొర్రె ఆదివారం మృతిచెందగా అదే గ్రామానికి చెందిన మోముల మల్లేశ్‌కు చెందిన మరో గొర్రె మంగళవారం మృతిచెందినట్లు పేర్కొంటున్నారు. గొర్రెల కొరత మూలంగా చిన్నవి పెద్దవి కలిపి ఇవ్వటంతో పాటు అనారోగ్యానికి గురైతే చికిత్సలు కూడా అందించటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. బీమా వర్తింపజేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



పెద్దఉమ్మెంతాల్‌లో మృతి చెందిన గొర్రె ఇదే

చేనేత, హస్తకళలను ఆదరించాలి



వస్త్రాలను పరిశీలిస్తున్న విజయమాల

పరిగి, న్యూస్‌టుడే: చేనేత, హస్తకళలను ఆదరించాలని సర్పంచి ఎ.విజయమాల అన్నారు. మంగళవారం సాయంత్రం తితిదే కల్యాణ మండపంలో గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆధునికతను ఆహ్వానిస్తూనే వీటిని ఆదరించాలని కోరారు. అంతరించిపోతున్న హస్తకళలను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, పి.రామచంద్రం, సభ్యులు హరి, గిరిబాబు, మండల తెరాస మహిళా విభాగం అధ్యక్షురాలు అనూష తదితరులు పాల్గొన్నారు.

రూ.5.5 కోట్ల పనులను పరిశీలించిన ఎస్ఈ

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంతో పాటు అల్లాపూరు గ్రామంలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.5.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులను మంగళవారం నీటిపారుదల శాఖ సూపరిండెంట్ ఆఫ్ ఇంజినీరు నరేందర్‌గౌడ్ పరిశీలించారు. తాండూరు పట్టణంలో రూ.1.5 కోట్ల వ్యయంతో అతిథి గృహ నిర్మాణం సాగుతోంది. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉండడంతో ఆయన స్వయంగా పరిశీలించారు. భవన నిర్మాణంలో కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని డీఈఈ నీరజ, సహాయ ఇంజినీరు నిఖేష్‌కు సూచించారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు భవన నిర్మాణం చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు. అనంతరం ఆయన తాండూరు మండలం అల్లాపూరు గ్రామ సమీపంలో మిషన్‌కాకతీయ కింద రూ.4.01 కోట్ల వ్యయంతో చేపడుతున్న జలాశయం పనులను పరిశీలించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన కాలువల పొడవు, వెడల్పు కొలతలను సిబ్బందితో తీయించారు. ప్రధాన కట్ట, అలుగు నిర్మాణాన్ని పరిశీలించారు. పనులన్నీ నాణ్యతగా ఉండాలని సూచించారు. పనులు జరుగుతున్న తీరును తరచూ పర్యవేక్షించాలని తాండూరు నీటి పారుదల శాఖ ఇంజినీర్లకు సూచించారు.

పురపాలక సంఘంలో విజిలెన్సు తనిఖీలు

పారిశుద్ధ్య నిర్వహణ అవకతవకలపై విచారణ

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: తాండూరు పురపాలక సంఘం కార్యాలయంలో రాష్ట్ర విజిలెన్సు అండ్ ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో అవకతవకలపై విచారణ చేపట్టారు. పారిశుద్ధ్య విభాగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రస్తుత అధ్యక్షురాలు సునీత 2012లో ఫ్లోర్‌లీడరుగా.. ప్రతిపక్ష కౌన్సిలరుగా ఉన్నప్పుడు పారిశుద్ధ్య విభాగంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుందని విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులకు ఫిర్యాదు చేశారు. విభాగం సిబ్బంది హాజరు, టెండర్లు, గుత్తేదార్లు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని అప్పటి జిల్లా పాలనాధికారి రఘునందన్‌రావుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆయన అప్పట్లోనే రాష్ట్ర విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సిఫార్సు చేశారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ అధికారులు సయ్యద్ అఫ్సర్, హనుమాన్‌గౌడ్ మంగళవారం పురపాలక కార్యాలయంలో విచారణ చేపట్టారు. గుత్తేదార్లను పిలిచి టెండర్ల కాంట్రాక్టు ఎవరు తీసుకున్నారు? వాస్తవంగా ఎవరు నిర్వహిస్తున్నారు? అని ఆరా తీశారు. సిబ్బంది హాజరు, వేతనాలు తదితర అంశాలు పరిశీలించారు. పారిశుద్ధ్య విభాగం దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 128 సర్వే సంఖ్యలో సెయింట్ మార్క్స్ ఉన్నత పాఠశాల భవనం నిర్మాణానికి సంబంధించి భూమి గురించి పరిశీలించారు. అనంతరం అధ్యక్షురాలు సునీతతో మాట్లాడారు. నివేదికను పురపాలక శాఖ డీజీ రాజీవ్ త్రివేదికి అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్సు అధికారులు


రాజీవ్‌గృహకల్ప కాలనీలో..

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు పట్టణ సమీపంలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని 864 గృహాలను బ్లాకులు వారీగా తనిఖీ చేశారు. ఇళ్లలో నిజమైన లబ్ధిదారులు ఉంటున్నారా? లేదా? అని ఆరా తీశారు. చాలా గృహాల్లో లబ్ధిదారులకు బదులు అద్దెకు ఉంటున్న వారి వివరాలు నమోదు చేసుకున్నారు. ఒక్కో ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు? ఎన్నేళ్ల నుంచి అద్దె చెల్లిస్తున్నారు? నెలకు ఎంత చెల్లిస్తున్నారనే వివరాలు రాబట్టారు. కాలనీలో లబ్ధిదారులు కొందరు ఇతరులకు గృహాలు విక్రయించినట్లు తనిఖీల్లో లభించిన దస్త్రాల ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. వారి వెంట తాండూరు గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజినీరు రషీద్ తెలిపారు.

అందుబాటులో చదువు...
అభ్యున్నతికీ ఆదరువు!

Telangana Open School Society

- గ్రామీణులకు అండగా నిలుస్తున్న సార్వత్రిక విద్యాపీఠం
- అక్టోబరు 4 వరకు దరఖాస్తులకు గడువు



న్యూస్‌టుడే, బొంరాస్‌పేట, తాండూరు గ్రామీణ

◆ బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్‌కు చెందిన రాములు గ్రామంలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. అప్పటి కుటుంబ పరిస్థితుల కారణంగా పక్క ఊరుకెళ్లి చదువును కొనసాగించలేక మధ్యలో ఆపేశారు. ఇప్పుడు డ్రైవింగ్ లైసెన్సు పొందాలన్నా, ప్రభుత్వ పథకాల్లో కొన్నింటిలో లబ్ధి పొందాలన్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత అడుగుతున్నారు. చిన్నప్పుడు పాఠశాలకెళ్లి చదువుకుంటే ఇప్పుడు బాధ పడాల్సిన అవసరం ఉండేది కాదని ఆవేదన చెందుతున్నారు.

◆ కుటుంబ, ఆర్థిక పరిస్థితులు తదితర కారణాలతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బడివయస్సు పిల్లలు చదువులకు దూరంగా ఉంటున్నారు. కొందరు ప్రాథమిక చదువులతోనే విద్యకు స్వస్తి పలుకుతున్నారు. ఉపాధికోసం ప్రభుత్వం అందించే రాయితీ రుణాలు పొందాలన్నా.. డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవాలన్నా పదో తరగతి చదువుకోవాలని అడుగుతున్నారు. పదో తరగతి చదువులతో నాలుగో తరగతి ఉద్యోగాలు పొందిన వారికి పదోన్నతులు పొందాలంటే ఇంటర్ చదువుండాలి.

◆ చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా తగిన సదుపాయాలు లేక చదువు మధ్యలోనే ఆపేసే ఇలాంటి వారికి, ఇంటి వద్దే ఉండి చదువుకోవాలని ఆశించిన మహిళలకు తెలంగాణ రాష్ట్ర 'సార్వత్రిక విద్యా పీఠం' ఉన్నత చదువులకు తోడుగా నిలుస్తోంది. శ్రద్ధ, పట్టుదల ఉంటే చాలు ఉన్నత చదువులు పూర్తి చేసుకోవచ్చని భరోసా కల్పిస్తున్నారు. దీన్లో ప్రవేశాలకు అక్టోబర్ 4 గడువు తేదీ. దీనికి సంబంధించి న్యూస్‌టుడే అందిస్తున్న వివరాలు

పదో తరగతి ప్రవేశాలకు..

ఎలాంటి విద్యార్హతలు లేకుండా 14ఏళ్ల వయస్సు నిండినవారై ఉండాలి. వయస్సు నిర్ధారణకు తహసీల్దారు, పురపాలక సంఘం అధికారులు జారీచేసిన ధ్రువ పత్రాలతో ప్రవేశాలు పొందాలి. గతంలో ప్రాథమిక పాఠశాలలో చేరినవారు వివిధ కారణాలతో మధ్యలో బడి మానేస్తే అప్పటి బదిలీపత్రం, ఆధార్, తల్లి ఆధార్ ధ్రువ పత్రాలతో ప్రవేశాలు పొందవచ్చు.

రుసుం చెల్లింపు ఇలా..

పదో తరగతిలో ప్రవేశాలు పొందటానికి రిజర్వేషన్ వర్తించని వారు ప్రవేశ రుసుం, పేరు నమోదుకు రూ.1,200 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మాజీ సైనికోద్యోగుల పిల్లలు, వికలాంగులు, మహిళలకు రూ.400 ఫీజు మినహాయింపు ఉంటుంది.

వారానికో రోజు తరగతులు

సాధారణ విద్యార్థుల మాదిరి వీరు పాఠశాలకు రోజూ రాలేరు కాబట్టి ఈ విధానంలో వారానికోరోజు తరగతులు నిర్వహించి వీరికి చదువులో కలిగే సందేహాలను నివృత్తి చేస్తారు. ప్రతిరోజు పాఠశాల, కళాశాలకెళ్లి చదువుకునే విద్యార్థులతో సమానంగా సార్వత్రిక విద్యాపీఠం వారు అందించే సర్టిఫికెట్లు పనిచేస్తాయి. 14ఏళ్ల వయస్సునుంచి 60 ఏళ్ల వయస్సు వారంతా ప్రవేశాలు పొందటానికి అర్హులు. జిల్లాలోని 18 మండలాల్లో 32 పాఠశాలలు, కళాశాలల్లో.. 30 పదోతరగతి, 31 ఇంటర్ అధ్యాయనకేంద్రాలతో తరగతులు కొనసాగిస్తూ విద్యావంతులుగా ఎదగటానికి ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఆసక్తిగల అభ్యార్థులు సెప్టెంబరు 4వరకు ప్రవేశాలు పొందవచ్చు. అవరాధ రుసుంతో 14వరకు అవకాశాలు కల్పించారు.

ఇంటర్ ప్రవేశాలకోసం..

పదోతరగతి ఉత్తీర్ణులై 15ఏళ్ల వయస్సు పూర్తయినవారు అర్హులు. పదో తరగతి బదిలీపత్రంతో ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చు. జిల్లాలో ఇంటర్ చదువుకోసం 31 అధ్యయన కేంద్రాలుండగా అందులో నవాబ్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాండూరులోని చైతన్య జూనియర్ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో సైన్స్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తితో అందులో ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు అక్కడే చేరాలి. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ప్రవేశరుసుం, నమోదుకు రూ.1,500 చెల్లించాలి. రిజర్వేషన్ వర్తించేవారికి ప్రవేశ రుసుంలో రూ.300 రాయితీ ఉంటుంది.

24 తరగతులకు హాజరు తప్పనిసరి

అధ్యయన కేంద్రాల్లో నిర్వహిస్తున్న సార్వత్రిక పాఠశాలల్లో ప్రవేశం పొందిన అభ్యాసకులకు ఉచితంగా పుస్తకాలను అందజేస్తారు. వారందరికి ప్రతి ఆదివారం, రెండవ శనివారం తరగతుల్ని నిర్వహిస్తారు. అభ్యాసకులు 24 తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలి. అభ్యాసకులు తక్కువ ఉంటే వారిని దగ్గర్లోని పరీక్ష కేంద్రాలకు పంపుతూ పరీక్షలు రాయిస్తున్నారు.

సాంకేతి విద్య సైతం..

సాంకేతిక రంగంలో గ్రామీణులు సైతం ముందుకు రావటంతో కంప్యూటర్ వినియోగం చాలా పెరిగిపోతోంది. అందులో భాగంగా సార్వత్రిక విద్యాపీఠంవారు గతేడాదినుంచే జిల్లాలోని ఒకటి రెండు కేంద్రాల్లో అప్పట్లో సాంకేతిక విద్యను ప్రవేశపెట్టారు. కొన్ని చోట్ల కుట్టు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటుతో వికారాబాద్ జిల్లాలో సాంకేతికవిద్య అందుబాటులో లేదు. దీనిపై అధికారులు త్వరలో నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

● అభ్యాసకులు తమకు ఆసక్తి ఉన్న అయిదు పాఠ్యాంశాలను ఎంచుకొని పదవ తరగతి పూర్తి చేసేందుకు వీలుంటుంది.

● తొలిసారిగా 2008-09 సంవత్సరంలో సార్వత్రిక విద్యను ప్రవేశపెట్టింది. అప్పట్లో కేవలం పదవ తరగతి మాత్రమే ప్రారంభించింది. ఏటా 5వేలకు తగ్గకుండా పదవ తరగతిలో ప్రవేశాలు పొందుతున్నారు. క్రమంగా సార్వత్రిక విద్యపై అభ్యాసకుల ఆసక్తి, పెరుగుతున్న ప్రవేశాలకు అనుగుణంగా ఇంటర్ విద్యనుసైతం అందుబాట్లోకి తెచ్చింది. 2010-11 సంవత్సరంలో ఇంటర్ ప్రవేశపెట్టడంతో ప్రవేశాల సంఖ్య మరింత పెరుగుతు వస్తోంది. సార్వత్రిక ఇంటర్‌ను రెగ్యులర్ ఇంటర్‌తో సమానం కావడంతో ఎక్కువమంది చేరేందుకు ఉత్సాహం చూపుతు సద్వినియోగం చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏటా సార్వత్రిక విద్యలో పదిశాతం ప్రవేశాలు పెరుగుతున్నాయి.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

– కె. నారాయణ, సార్వత్రిక పాఠశాల, కళాశాల జిల్లా సమన్వయకర్త, మాతృ రంగారెడ్డిజిల్లా



గ్రామీణ ప్రాంతాల యువత ఉన్నత విద్యావకాశాలు పొందటానికి ఇదో మంచి అవకాశం. చిన్న ఉద్యోగాలు చేస్తున్న వారంతా ఇంటర్ ప్రవేశాలతో పదోన్నతులు పొందవచ్చు. గ్రూపులకు సన్నద్ధం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రతిరోజు పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు అందించే ధ్రువ పత్రాలకు సార్వత్రిక విద్యాపీఠం అందించే పత్రాలు సమానంగానే పనిచేస్తాయి.

మొక్కలు నాటుదాం... సంరక్షిద్దాం

దౌల్తాబాద్: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని కాపాడుకోవాలని రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది సూచించారు. మంగళవారం మండలంలోని సూరాయిపల్లి గ్రామంలో రేషన్ దుకాణం ద్వారా ప్రతి కుటుంబానికి రెండు మొక్కలను వీఆర్వోలు అంజిలయ్య, ప్రశాంత్, హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మయ్యలు సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపడుతుందని అందులో ప్రతి ఒక్కరం బాగస్వామ్యులం కావాలన్నారు. సరిపడునన్ని వృక్షాలు లేకపోవడంతోనే ప్రస్తుత కరువు పరిస్థితులకు కారణమని ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో మనుగడ కష్టమని అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలూ నాటి వాటిని పెంచే భాద్యతను తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో చౌకదుకణాల డీలర్ నాగభూషణం, గ్రామస్థులు తదితరులున్నారు.



గ్రామస్థులకు మొక్కలను అందిస్తున్న అధికారులు

గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు

ఆచార్య ఎన్.జి రంగా వర్సిటీ ఉపకులపతి దామోదరనాయుడు

గుంటూరు, న్యూస్‌టుడే: పత్తిలో కాయ తొలిచే గులాబీ రంగు పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి దామోదరనాయుడు సూచించారు. గుంటూరు లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాలులో పత్తిలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పత్తి పరిశోధన శాస్త్రవేత్తలు ఈ సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు అందజేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా గులాబీ రంగు పురుగు గురించి రైతుల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించామని దామోదరనాయుడు తెలిపారు. ఈ పురుగు ఉనికిపై పంట కాలంలో ప్రతి వారం రైతులకు సంక్షిప్త సందేశాలు అందజేసి చైతన్యం తీసుకువస్తామని వివరించారు. పత్తి పంట దగ్గరలో బెండ, తుత్తుర బెండ వంటి కలుపు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వెల్లడించారు.

'పాలమూరు ఎత్తిపోతలను సాధించుకుందాం'

కొడంగల్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రాణాలు అడ్డు పెట్టి అయినా సరే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సాధించుకుందామంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అధ్యయన కమిటీ సభ్యుడు, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు రాఘవాచారి స్పష్టం చేశారు. మంగళవారం కొడంగల్‌లోని అతిథి గృహంలో అఖిల పక్షనాయకులతో కలిసి ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని మార్చేసి, జీవో నెం.69 అమలుపరచక పోవడంతో రైతాంగానికి జరిగిన నష్టాన్ని నివారించటానికి వెంటనే సాధించుకున్న ఉత్తర్వుల మేరకు జూరాల ప్రాజెక్టు నుంచి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఫేజ్ 1 చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పరమాటి చిన్నా, హనీఫ్, అఖిలపక్ష నాయకులు కృష్ణంరాజు, దామోదర్ రెడ్డి, ఇందనూర్ బషీర్, భువనప్ప, చంద్రప్ప, రవీందర్ గౌడ్, తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు,



సమావేశం అనంతరం కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

స్తంభించిన బ్యాంకింగ్ లావాదేవీలు

హైదరాబాద్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు ఒక రోజు సమ్మెకు దిగడంతో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోయాయి. సమ్మెతో బ్యాంక్ స్ట్రీట్‌తోపాటు హనుమాన్‌టేక్డీ, బొగ్గులకుంట, కోఠి, తిలక్ రోడ్ తదితర ప్రాంతాల్లోని అన్ని జాతీయ బ్యాంకులు మూతపడటంతో రూ.కోట్ల వ్యాపార లావాదేవీలు స్తంభించిపోయాయి. బ్యాంక్‌స్ట్రీట్‌లోని ఎస్‌బీఐ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం, సెంట్రల్ బ్యాంక్ వద్ద వందలాది మంది బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. వారం క్రితం వరసగా నాలుగు రోజులు బ్యాంకులకు సెలవులు రావడం, సమ్మెతో మంగళవారం మూతపడటంతోపాటు ఏటీఎం కేంద్రాలు పని చేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

పరిగి

10లోపు పింఛను అందించాలి

పూడూరు: ఆసరా పింఛన్‌ను ప్రతి నెల 10వ తేదీలోపు అందించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు పూడూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పూడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు నెలకు సంబంధించి వితంతు, వృద్ధాప్య ఇతర పింఛన్‌లు సకాలంలో పొందలేక పోతున్నామని చెప్పారు. దివ్యాంగులకు సకాలంలో పింఛన్ అందిస్తే తగిన ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎక్‌మామిడి (నవాబుపేట), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామంలో నవోదయ యువజన సంఘం నూతన క్యార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షుడిగా అనంతయ్య, కుమార్, కార్యదర్శులుగా ఎం నర్సిములు, జి మాణిక్యం, కోశాధికారులుగా బి.రవికుమార్, ఎన్.శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యువజన సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కొత్త కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రమేష్




అంతారంలో టీకాను వేయిస్తున్న సీహెచ్‌ఓ చంద్రప్రకాష్



అనంతసాగర్‌లో టీకాలను వేయిస్తున్న వెంకటాచారి

టీకాలతో రోగ నిరోధక శక్తి పెంపు

పరిగి, న్యూస్‌టుడే: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ జిల్లా మానిటరింగ్ అధికారి టి.రమేష్, జిల్లా మాస్ మీడియా అధికారి చంద్రయ్య, చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రమణా రెడ్డి అన్నారు. మంగళవారం విద్యారణ్యపురిలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయంలో తట్టు, పొంగు వ్యాధిని నివారించే ఇంజక్షన్లను విద్యార్థులకు ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రుబెల్లా టీకాతో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. టీకాలకు ఎవరూ భయపడాల్సిన పని లేదని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే తట్టు, పొంగు వ్యాధుల నుంచి ఈ టీకా రక్షిస్తుందని రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అంతకుముందు పరిగిలోనీ టీచర్స్ కాలనీలో గల మదర్సా పాఠశాలలో టీకాల పరిస్థితిని పర్యవేక్షించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయం ప్రధానాచార్యులు వేణుగోపాల్, సీహెచ్.బాలరాజు మాట్లాడుతూ తమ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తరచూ సందర్శించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుట్టాపహాడ్‌లో టీకా వేస్తున్న ఏఎన్ఎం మంగమ్మ

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: రుబెల్లా టీకాతో మంచి ప్రయోజనాలు ఉన్నాయని సీహెచ్‌వో చంద్రప్రకాష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుట్టాపహాడ్, అంతారం గ్రామాలలో రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమంను చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో మాట్లాడుతూ...తట్టు, పొంగు వంటి ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించాలంటే తప్పకుండా రుబెల్లా టీకాను వేయించాలని ఆయన కోరారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో చిన్నారులకు పూర్తి స్థాయిలో టీకాలను వేయించడం జరిగిందన్నారు. రుబెల్లా టీకాను వేయించడంలో ఎలాంటి అపోహలకు గురికావద్దన్నారు. ఇంతకు ముందు వేరే ఇతర టీకాలను వేయించిన కూడా ప్రస్తుతం రుబెల్లా టీకాను వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంతారం గ్రామంలో....

అంతారం గ్రామంలో సర్పంచ్ పుష్పలత రుబెల్లా టీకాను వేసే కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో టీకాను వేసే కార్యక్రమంను చేపట్టిందన్నారు. రుబెల్లా టీకాతో మంచి లాభాలు ఉన్నాయన్నారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సున్న ప్రతి ఒక్కరు ఈ టీకాను తప్పకుండా వేయించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కుల్కచర్ల మండల పరిధిలోని కుస్మసముద్రంలో తట్టు, రుబెల్లా వ్యాధులకు సంబంధించిన టీకాలను వేయించే కార్యక్రమాన్ని ఎంపీపీ అరుణరాజప్ప ప్రారంభించారు. అనంతసాగర్‌లో ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి తదితరులు పాల్గొని వాటి ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వం ఉచితంగా ఈ టీకాలను వేయిస్తోందని అన్నారు. వీటిని వేయించడం వల్ల పిల్లలకు ఎంతో మేలు చేకూరుతోందని అన్నారు. తట్టు వల్ల పిల్లలను కాపాడుకోవచ్చని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు అందరు సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉందని ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారి పేర్కొన్నారు.



కుస్మసముద్రంలో పాల్గొన్న ఎంపీపీ అరుణరాజప్ప

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందే!



ప్రతులను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

పరిగి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1న ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ సామూహిక సెలవు పెట్టి దీక్ష చేపడతామని ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం.బసిరెడ్డి, వెంకటేశం, టి.వెంకటయ్య, బుగ్గయ్య, సుధాకర్, రామ్మోహన్, మహేందర్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నం.1 ఆవరణలో గోడ ప్రతులను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ పథకం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాధికారి అంజిలయ్య, ఉపాధ్యాయ సంఘ నాయకులు అనంతయ్య, కరుణాకర్, చంద్రశేఖర్, శ్రీశైలం, బుచ్చిబాబు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని కాలనీల్లో సీసీ రహదారులు



చౌడాపూర్‌లో సీసీ రహదారి పనుల ప్రారంభం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సిసి రహదారి పనులు గ్రామ పంచాయితీ సర్పంచ్ అధ్వర్యంలో విపణి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రహదారులను అవసరమైన అన్ని కాలనీల్లో నిర్మించుకోవాలని సూచించారు. ఆయా పథకాల కింద గ్రామ పంచాయితీలకు నిధులు మంజూరు అవుతున్నాయని అన్నారు. గ్రామాల్లో స్థానికులతో చర్చించి అవసరమైన అన్ని పనులను చేసుకోవడం మంచిదన్నారు. తద్వార మంచి పేరు వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రామకృష్ణారెడ్డి, కొత్త ఉమాపతిరెడ్డి, నాగరాజు, స్థానికులు పాల నర్సింలు, మాజి ఎంపీటీసి గందె రాజప్ప తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలి

కుల్కచర్ల: చవితి సందర్భంగా ఏర్పాటు కానున్న మండపాలకు విద్యుత్ కనెక్షన్లను ట్రాన్స్‌కో నుంచి పొందాలని ట్రాన్స్‌కో ఏఇ రవిచంద్రారెడ్డి సూచించారు. వాటికి మీటర్లను జారీచేస్తామని అన్నారు. తాత్కాలికంగా కొక్కెలను తగిలించడం వంటివి చేయరాదని తద్వారా ఇబ్బందులు ఎదురవుతాయన్న విషయాన్ని నిర్వాహకులు గమనించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీడీలను చెల్లించి శాశ్వత కనెక్షన్లను పొందడం అందరికి మేలని అన్నారు. నిమజ్జన సమయంలో కూడా రహదారిపై విగ్రహాలను వాహనాలపై తీసుకుపోతున్నప్పుడు వైర్లను ఎక్కడిక్కక్కడ తగిలిస్తు పోతుంటారని ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. దీనికి గాను ఎవరికి వారు జనరేటర్‌లను వాడుకోవడం మేలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా 9440813087కు సంప్రదించాలని ఆయన సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మట్టి విగ్రహాలను తయారు చేయిస్తున్న రాజు

పరిగి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండలంలోని యాబాజిగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని పర్యావరణానికి ప్లాస్టిక్ తీవ్ర విఘాతం కలిగిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి రంగులు లేకుండా మట్టితో తయారు చేస్తే ఎంతో మేలని చెప్పారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

పేదల మనిషి వెంకట రామిరెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: పేదల మనిషి, రెడ్డి జాతి ఆరాధ్య దైవం, హైదరాబాద్ ప్రథమ కొత్వాల్ రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి పరిపాలన దక్షత, సేవా నిరతిని గుర్తించి ప్రభుత్వం భారత రత్న ప్రదానం చేయాలని రెడ్డి జాగృతి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పి.అనంతరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎం.శ్రీరాంచంద్రారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. నిజాం కాలంలో పునర్వికాసానికి కృషి చేసిన చారిత్రాత్మక కేంద్రం రెడ్డి హాస్టల్ అని చెప్పారు. రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి పూనికతో 1917లో ఏర్పాటైన వసతి గృహం గ్రంథాలయోద్యమానికి, పత్రికా వికాసానికి, విద్యాభివృద్ధికి కేంద్రమైందని చెప్పారు. హైదరాబాద్‌లో చదువుకునేందుకు వచ్చిన రెడ్డి విద్యార్థులతో పాటు ఇతర కులాలకు చెందిన విద్యార్థులను కన్నతల్లిలా ఆదరించి అక్కున చేర్చుకుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కులస్థులను అన్ని విధాలుగా ఆదుకోవాలని విద్యా, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు నర్సింహ్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శివారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, పార్వత్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతరెడ్డి

పరిగి

క్రీడాకారులను ప్రోత్సహించండి

దోమ, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన క్రీడాకారులను తట్టి ప్రోత్సహించాలని సర్పంచి భర్త మైపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు యాదగిరి అన్నారు. మంగళవారం దోమ మండలం దిర్సంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సొంత డబ్బులు వెచ్చించి ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి నుంచి జరిగే అండర్ 14/17 బాలబాలిక జోన్‌ల్‌స్థాయి ఖోఖో క్రీడాపోటీల ఎంపికలో సత్తాచాటాలని కోరారు.

పేదల కోసమే ప్రభుత్వ పథకాలు




చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 62 మందికి రూ.30.76లక్షలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో మాదిరిగా జాప్యం జరగకుండా సకాలంలో పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు గోవిందమ్మ, కాంగ్రెస్, తెరాస నాయకులు బి.నారాయణరెడ్డి, బి.సుభాష్‌రెడ్డి, గోపాల్, మణిపాల్, నర్సిములు, టి.వెంకటేష్, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మునీర్, వెంకటయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి ఆసరా...

పూడూరు: కల్యాణ లక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఆసరగా నిలుస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజురయిన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల పెళ్లిళ్లకు ఎంతో దోహద పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి పెంటయ్య, తహసీల్దారు కిషన్. నాయకులు షకీల్, అమరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

పాఠ్య ప్రణాళికలను కార్యరూపంలో చూపండి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: పాఠశాలల్లో తరగతి గదిలో బోధనకు వెళ్లే ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యప్రణాళిక ఆధారంగానే బోధన చేయాల్సిన అవసరం ఉందని చౌడాపూర్ కాంప్లెక్ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మంగళవారం చౌడాపూర్‌లో కాంప్లెక్ సమావేశం జరిగింది. ఫార్మేటివ్ పరీక్షలు, చదవడం, రాయడం, చతుర్విధ పక్రియలు, ప్రాజెక్ట్ వర్క్, వార్షిక పరీక్షలు, పాఠ్య ప్రణాళికలు, అభ్యసనాభివృద్ధి తదితర వాటిపై చర్చ జరిగింది. మాదిరి పాఠ్యబోధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి నుంచైనా పాఠ్యప్రణాళికలను ప్రతి రోజు రాయాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వార ప్రణాలిక బద్ధంగా ముందుకు వెళ్లవచ్చని, మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. ఆర్ఆర్ఆర్‌లకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. నాణ్యమైన విద్యను అందించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై మరింత నమ్మకాన్ని పెంచవచ్చని అన్నారు. కాంప్లెక్స్‌లో చర్చించిన ప్రతి అంశాన్ని అమలులో పెట్టాల్సిన అవసరం ఉందని అలా అయితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గిరమోని కృష్ణుడు, కాంప్లేక్స్ కార్యదర్శి కె అంజనేయులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోమన్‌గుర్తిలో పారిశుద్ధ్యం పనులు



గడ్డిమందు పిచికారి చేస్తున్న యువజనులు

సోమన్‌గుర్తి(పూడూరు): మండల పరిధిలోని సోమన్‌గుర్తిలో స్థానిక స్వయం కృషి యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు మంగళవారం పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. వీధుల్లో పెరిగిన పిచ్చిమొక్కల నివారణ కోసం గడ్డింమందు పిచికారి చేయించారు. కాలువలను శుభ్రం చేయటంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా జనాలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దీంతో యువజన సంఘం సభ్యులందరం ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా గ్రామానికి చేయిత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అధ్యక్షులు నారా రాజేందర్, సభ్యులు జనార్ధన్, రాము, బందయ్య, శేఖర్, బాలు, అనంతరాములు, అంజేయిలు ఉన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంఛార్జి విద్యాధికారి అంజిలయ్య

పరిగి, న్యూస్‌టుడే: అభ్యసన అభివృద్ధిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కొత్త పద్ధతులతో కనీస అభ్యసన స్థాయికి తీసుకురావాలని మండల ఇంఛార్జి విద్యాధికారి అంజిలయ్య అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నం.1లో పాఠశాల సముదాయ వృత్యంతర శిక్షణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేసుకుని పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. అనంతరం తెలుగు పండిత్ జి.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రారంభ పరీక్ష నిర్వహించి వెనుకబడిన వారిలో 'సి' గ్రేడ్ వారిని గుర్తించి సంబంధిత ఉపాధ్యాయుడు అదనపు బోధన చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు మహేంద్ర బహదూర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వశిక్ష అభియాన్ ఐకాస కార్యవర్గం

పరిగి, న్యూస్‌టుడే: సర్వశిక్ష అభియాన్ నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో జరిగాయి. ఐకాస అధ్యక్షునిగా జి.వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శిగా పారిజాత, ఉపాధ్యక్షునిగా జి.మోహన్‌బాబు, గౌరవాధ్యక్షురాలిగా డి.స్వప్న, మహిళా కార్యదర్శిగా కె.జ్యోతి, కోశాధికారిగా ఎం.సత్తయ్య, సహ కార్యదర్శిగా ఎస్.భారతమ్మ, సలహాదారులుగా ఎన్.అనంతవిద్యాసాగర్, సభ్యులుగా జి.శ్రీనివాస్, రఘు, నర్సిములు, హన్మంత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

దోమ, న్యూస్‌టుడే: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల వెంటనే పరిష్కరించాలని జేఏసీ(జాక్) దోమ మండల అధ్యక్షుడు రఘుసింగ్ అన్నారు. మంగళవారం దోమ మండల పరిషత్, తహసీల్దార్, విద్యాశాఖ అధికారులకు సమస్యలు తీర్చాలని వివరిస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమానవేతనం ఇవ్వాలికోరారు. 12 నెల్ల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి పేర్కోన్నారు. మహిళా ఉద్యోగలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాక్ జేఏసీ మండల ఉపాధ్యక్షులు జంగయ్య, మహిళా గౌరవ అధ్యక్షురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే ప్రభుత్వ పాఠశాలల ప్రగతి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముజాహిద్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దేవుజా, మల్లిఖార్జున్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల, ముజాహిద్‌పూర్ గ్రామాలలో ఎస్ఎంసీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ....గ్రామంలో ఉన్న పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ప్రజల సహకారం అవసరం అన్నారు. ప్రజల సహకారంతో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తున్నారని వారు పేర్కొన్నారు. బండవెల్కిచర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం చైనా మనదేశంపై యుద్దం ప్రకటించడానికి సిద్దంగా ఉందన్నారు. మనం కూడా చైనా వస్తువులను పూర్తిగా నిషేదించాలని ఉపాధ్యాయులు తీర్మాణం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతోపాటు అభివృద్ధి ముఖ్యం



మాట్లాడుతున్న ఏపీఎం బందెయ్య

దోమ, న్యూస్‌టుడే: గ్రామ సమాఖ్యలోని డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎం బందెయ్య అన్నారు. మంగళవారం దోమ మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపులుచేయాలి, అప్పులు చెల్లించి సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మీ పై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాలు చెలించి సహకరించాలని కోరారు. సంఘాలు అభివృద్ధి చెందితేనే మండల సమాఖ్యకు ఆర్థిక పరిపుష్టి కల్గుతుందన్నారు. ఈ సందర్భంగా నూతన మండల మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నికైనట్లు తెలిపారు. మండల అధ్యక్షురాలుగా మొగలమ్మ, ఉపాధ్యక్షురాలు లక్ష్మమ్మ, కార్యదర్శి వెంకటమ్మ, సహాయ కార్యదర్శి అమృతమ్మ, కోశాధికారి రమాదేవి, గ్రామ సంఘాల ప్రతినిధులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు జంగయ్య, నారాయణ, లక్ష్మారెడ్డి, నర్సిములు, అసేం, సుజ్ఞాని, కల్పన, అంజమ్మపాల్గొన్నారు.

పాత పింఛను విధానమే ఉండాలి

దోమ, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పింఛను పథకాన్ని అమలు చేయాలని టిఎస్‌సిపిఎస్ఈఏ డిమాండ్ చేసింది. సెప్టెంబరు 1న అన్నిశాఖల ప్రభుత్వ ఉద్యోగులు సామూహిక సెలవు పెట్టి సంఘీ భావం తెలిపాలని కోరారు. సెప్టెంబరు 1 ఉద్యోగులకు చీకటి రోజుగా గుర్తించాలని పేర్కొంది. దోమ మండల శాఖ ఆధ్వర్యంలో దోమ తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఉపతహసిల్దార్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదలచేశారు. కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈఏ దోమ మండల శాఖ బాధ్యులు ఆర్ఐ సురేష్, శ్రీనివాస్ ఉపాధ్యాయుడు , రాజేందర్,తిరుపతయ్యగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, బిచ్చయ్య, రాములు మండల ఏఓ, టిచర్స్ వసంతలక్ష్మి, సునిత , శోభ ,విజయబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించండి

దోమ, న్యూస్‌టుడే: గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం దోమలో శాంతి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిష్ఠాపన రోజునే మైకులు ఏర్పాటుకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. డీజేలకు ఎట్టి పరిస్థితిలో అనుమతించమని పేర్కొన్నారు. శాంతికి విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. యువత ఐక్యంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలుగ్రామాలసర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సగరులను బీసీ ఏ లో చేర్చండి



వినతి పత్రం ఇస్తున్న సగర సంఘం నాయకులు

పరిగి, న్యూస్‌టుడే: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన సగరులను బీసీ డి నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు యు.రవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లేశం, అధికార ప్రతినిధి యాదయ్య కోరారు. ఈమేరకు మంగళవారం నగర సగర సంఘం అధ్యక్షుడు బంగారి నర్సింహ్మా, ప్రధాన కారక్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షుడు రాంచందర్, సంయుక్త కార్యదర్శి ఆర్.నర్సిములు నేతృత్వంలో బీసీ కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సగరులు అన్ని రంగాల్లోనూ వెనుకబడినట్లు చెప్పారు. గ్రూపు ఏ లోకి మార్చితేనే సమన్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు నర్సిములు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ మెట్రిక్ ఉపకారవేతనాలకు

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: 2017- 18 విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న బీసీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకారవేతనాల కోసం దరఖాసు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పుష్పలత సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.5లక్షలు ఉండాలన్నారు. ఎంపిక అయిన వారికి నెలకు రూ.100 చొప్పున పది నెలకు రూ.1000 బీసీ సంక్షేమ శాఖ మంజూరు చేస్తుందని తెలిపారు. ఆధార్‌కార్డు నకలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేయాలన్నారు. విద్యార్థి బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, బోనఫైడ్, కలర్‌ఫొటో, చరవాణి సంఖ్యలు తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30 లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని సూచించారు.

విద్యే కట్టుబాట్లను ఛేదించే సోపానం



మాట్లాడుతున్న జడ్పీ అధ్యక్షురాలు సునీతారెడ్డి



సదస్సుకు హాజరైన డిగ్రీ విద్యార్థినిలు

జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు

వికారాబాద్, న్యూస్‌టుడే: మహిళలకు సమాజం ఎన్నో కట్టుబాట్లు, ఆంక్షలు విధిస్తుందని, ఈ కట్టుబాట్లను ఛేధించాలంటే విద్య ఒక్కటే సరైన సోపానమని జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు పి.సునీతారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సత్య భారతి ఫంక్షన్‌హాల్‌లో సబితాఆనంద్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 'మహిళా- సాధికారిత' అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని అన్నారు. మహిళలు సొంతంగా ఆలోచించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. నాటికీ నేటికీ తల్లిదండ్రుల ఆలోచనా విధానాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని, బాలురతో పాటే బాలికలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. బాల్యవివాహాలు జరుగకుండా అరికట్టాల్సిన బాధ్యత విద్యావంతులైన యువతులపై ఉందన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దు

– దివ్య, జిల్లా పాలనాధికారిణి

మహిళలు ఏ పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని జిల్లా పాలనాధికారిణి దివ్య అన్నారు. బాలికలకు ప్రతికూల ఆలోచనల అనుభవాలే అధికంగా ఎదురవుతాయన్నారు. చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలోని ఓ పల్లెటూరులో జన్మించిన తనకు కుటుంబ సభ్యుల నుంచి రాజు పుడతాడనుకుంటే రాణి పుట్టిందన్న అనుభవం బాల్యంలోనే ఎదురైందని అన్నారు. కేవలం చదువుకుంటే సరిపోదని, ఉద్యోగం సాధించి సమాజానికి సేవ చేసే అవకాశం పొందాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ సాధించాలంటే నూటికి నూరుశాతం మార్కులు రావాల్సిన అవసరం లేదని, సాధించాలన్న తపన బలంగా ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు.

బాల్య వివాహాలకు చరమగీతం పాడాలి

– అన్నపూర్ణ, జిల్లా పోలీసు అధికారిణి

బాల్య వివాహాలకు చరమగీతం పాడి, జిల్లాను బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అందరూ కృషి చేయాలని జిల్లా పోలీసు అధికారిణి అన్నపూర్ణ అన్నారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినవారే అధికంగా ఉంటారని, ఆయా గ్రామాల్లో బాల్యవివాహాలు నిశ్చయమైతే వెంటనే తెలిసిపోతుందన్నారు. బాల్య వివాహమని తెలిసిన వెంటనే 1098, 100లకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. పరిగి, తాండూర్, వికారాబాద్‌లలో 'షీ' బృందాలు చురుకుగా పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, వికారాబాద్ ఎంపీపీ భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ ముత్తహర్‌షరీఫ్, ఎంపీడీఓ సత్తయ్య, వైద్య దంపతులు ఆనంద్, సబిత, సాహితీ సమితి ప్రతినిధులు చక్రవర్తుల వేణుగోపాలరావు, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా నయాదృశ్యం..!

నిఘా నీడలో విశ్వవిద్యాలయం ➡ మొదటి దశలో 156 సీసీ కెమెరాలు.. రెండో దశలో 150

ఓయూ, న్యూస్‌టుడే: శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న విద్యానిలయం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భద్రతా చర్యలపై.. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 1,630 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్నా ఆవరణలో అనేక ఆకతాయిల చేష్టలతో పాటు అనేక ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితమే దాదాపు పది కోట్ల రూపాయలతో ఆవరణలో అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ అమలుకు ఇంతకాలం పట్టింది. ఇప్పుడు దాదాపు రూ.1.5 కోట్లతో 156 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండో దశలో మరికొన్ని కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

కిలోమీటరు వరకు స్పష్టత

ఓయూలో మొదటి దశలో 156 కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిలో అధునాతనమైన ఆరు కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా దాదాపు ఒక కిలోమీటర్ దూరం వరకు ఉన్న వారిని కూడా స్పష్టంగా చూడవచ్చు. ఓయూలో ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్‌టీసీ దవాఖానా (తార్నాక) వరకు మెయిన్ రోడ్డుపై 50 కెమెరాలను ఏర్పాటు చేశారు. మిగిలిన వాటిని ఓయూలోని అంతర్గత కళాశాలల వద్ద, పరిపాలన భవనం, ప్రిన్సిపల్ కార్యాలయం తదితరాల వద్ద ఏర్పాటు చేశారు. మొత్తం కెమెరాలను ఓయూలోని సీఎఫ్‌ఆర్‌డీ బిల్డింగ్‌లో కెమెరా కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ దాదాపు ఒక నెల రోజులకు సరిపడా డేటాను నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ప్రధాన రోడ్డుపై ఉన్న 40 కెమెరాలను ఓయూ పోలీస్‌స్టేషన్‌తో కూడా అనుసంధానం చేశారు. విశ్వవిద్యాలయంలో ఏ మూలన ఏం జరుగుతోందనే విషయాలన్నీ కంట్రోల్ రూమ్‌లో చూసుకునే వీలుంది. ప్రస్తుతం అన్ని కెమెరాలను ఒకేసారి వీక్షించేందుకు పది భారీ తెరలను ఏర్పాటు చేశారు. రెండో దశలో ప్రతి కళాశాల ప్రాంగణం, విద్యార్థుల వసతిగృహాలు, వివిధ విభాగాల అధిపతుల కార్యాలయం ముందు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే వివిధ వసతిగృహాల్లో విద్యార్థుల చరవాణీలు, ల్యాప్‌టాప్‌లు దొంగతనం అవుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. వాటి నియంత్రణకు తక్షణమే వసతిగృహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

తెలుసుకోవడం సులభం

యూనివర్సిటీ ప్రాంగణం చాలా విశాలంగా ఉండడం.. అనేక అనుబంధ కళాశాలలు ఉండటంతో కొత్తగా వచ్చేవారికి ఎక్కడ ఏ కార్యాలయం, కళాశాల ఉంటుందో తెలియదు. నిత్యం వేలల్లో విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం ఓయూను సందర్శిస్తుంటారు. సులభంగా ఎవరైనా చిరునామా తెలుసుకోవడానికి ఓయూలో కొత్త మార్గసూచీలను ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు ఉన్నా వాటిపై వివిధ సంఘాల వారు అనేక గోడపత్రికలు నిత్యం అతికిస్తుండటంతో వాటిపై సూచికలు కనబడటం లేదు. ప్రస్తుతం రెండు చోట్ల ఏర్పాటు చేశారు. మరో ఎనిమిది కూడళ్లలో బిగించనున్నారు.



వర్సిటీ దారుల పక్కన ఏర్పాటు చేసిన కెమెరాలు

క్యాంపస్‌లో భద్రత కోసం వాహనాలను నిషేధించాలి

– శ్రీహరి, ఏబీవీపీ ఓయూ ఇన్‌ఛార్జి

ఓయూ భద్రత విషయంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఒకటే సరిపోదు. ప్రాంగణంలోని ప్రధాన రాహదారిపై ప్రైవేటు వాహన రద్దీని నియంత్రించాలి. క్యాంపస్‌లో విద్యార్థులు రోడ్డు దాటేందుకూ కూడా ఇబ్బంది పడుతున్నారు. గతంలో 2015లో న్యాయ కళాశాల వద్ద గొలుసు దొంగల కారణంగా రోడ్డుపై మహిళ మరణించింది. 2016లో క్యాంపస్‌లోని నీటి ట్యాంకులో గుర్తుతెలియని మృతదేహం దొరికింది. అటువంటి సంఘటలను నియంత్రించాలంటే బయటి వ్యక్తులు, వాహనాలపై నిషేధం కూడా అమలు చేయాలి.

విద్యార్థుల భద్రతే ముఖ్యం

ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.గోపాల్‌రెడ్డి

విద్యార్థుల భద్రతే ముఖ్యం. వారి భద్రత కోసమే ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. యూజీసీ కూడా యూనివర్సిటీలలో భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది. మొదటి దశలో 156 కెమెరాలను ఏర్పాటు చేశాం. రెండో దశలో మరో 150 దాకా కెమెరాలను ఏర్పాటు చేస్తాం. న్యాక్ గుర్తింపునకు ఈ సీసీ కెమెరాలు దోహదం పడుతాయి. త్వరలోనే వసతిగృహాల వద్ద కూడా ఏర్పాటు చేస్తాం.

మీ కాలనీ కళ తప్పుతోందా...!

న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్

జిల్లాలో ఇటీవల ఆగిఆగి వర్షాలు కురుస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రజలు అధికంగా నివసించే, ఇరుకు వీధులు ఉండే పట్టణాలకు అశనిపాతం వంటిది. నీళ్లు నిలుస్తుండటంతో వీధుల్లో పరిశుభ్రత అధ్వానంగా మారుతుంది. చాలాచోట్ల రోడ్లపై గుంతలు పడతాయి. వాహనాల రాకపోలకు విఘాతమూ కలుగుతుంది. కాలువల్లో చెత్తాచెదారం చేరుతుండటంతో మురుగు రోడ్లపై పారుతుంది. ఇలాంటి సమస్యలతో మీరు కూడా అవస్థలు పడుతున్నారా? వెంటనే ఫొటోలు తీసి ఈనెల 24వ తేదీ వరకు మాకు వాట్సప్‌లో పంపండి. మీరు పంపిన వాటిలో నుంచి సమస్యల తీవ్రత అధికంగా ఉన్న వాటిని ఎంపిక చేసి, ప్రచురిస్తాం. అధికారులు, మీ ప్రాంత ప్రజాప్రతినిధులు వాటిపై దృష్టి నిలిపే అవకాశముంది. ఇంకెందుకు ఆలస్యం.. మీ కెమెరా, స్మార్ట్‌ఫోన్‌కు పని చెప్పండి. మీ ప్రాంతంలోని అపరిశుభ్రత, రోడ్ల సమస్యల ఫొటోలను వెంటనే వాట్సప్‌లో పంపించండి. మీ పేరు, నివసిస్తున్న పట్టణం, సమస్య ఏ వీధిలో ఉందో వివరాలను స్పష్టంగా తెలపండి.

వెంటనే వాట్సప్ చేయండి

పంపాల్సిన వారు: వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల స్థానికులు.



ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్లు: 8008573279, 8008573260

పంపాల్సిన తేదీ: ఈనెల 24(గురువారం) మధ్యాహ్నం 2 గంటల్లోపు...

నాణ్యత... కరవై కలత!

(మొదటిపేజీ తరువాయి) చెరువులో నీరు నిలిచే వీల్లేకుండాపోయింది. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా అన్ని పనులనూ నిలిపివేశారు.

కట్టపై మట్టిని తొక్కించాలి

-చంద్రమ్మ, ఆయకట్టు రైతు, బెల్కటూరు

కట్ట నిర్మాణ సమయంలో మట్టి వేసి వదిలేశారు. వర్షంపడినప్పుడు బురదగా మారుతోంది. కట్టమీద ఎత్తుపల్లాలుగా మారింది. కట్ట పక్కభాగంలోను మట్టిని సరిచేయించాలి. చెరువులోని ముళ్ల పొదలు పూర్తిగా తొలగిస్తే నీరు నిలిచి ఉపయోగముంటుంది.

కట్టపై పగుళ్లు వచ్చాయి: రవి, ఆయకట్టు రైతు, రాంపూర్

చెరువు కట్ట నిర్మించిన కొంతకాలానికే పగుళ్లు వచ్చాయి. సరిగ్గా పనులు చేయకపోవడంతోనే పెద్దపెద్ద పగళ్లు ఏర్పడ్డాయి. కట్ట పైభాగంతోపాటు రెండు దిక్కులా అట్లాగే ఉంది. మిగిలిన పనులు కూడా ఇంకా మొదలు పెట్టడంలేదు. కట్ట పనులకే పరిమితం చేశారు. తూము, అలుగు నిర్మాణాన్ని తొందరగా పూర్తిచేయిస్తేనే ప్రయోజనం ఉంటుంది.

పనులు ఇంకా కొనసాగుతున్నాయ్

-నిఖేష్, ఏఈ, నీటిపారుదల శాఖ, తాండూరు

మూడో విడత చెరువుల మరమ్మతుల పనులు ఇంకా పూర్తికాలేదు. వర్షాల కారణంగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు నిర్మించిన చెరువుల కట్టలకు ఏర్పడిన పగుళ్లను సరి చేయిస్తాం. సిమెంటు పనుల్ని కూడా త్వరలో ప్రారంభింపజేస్తాం. అన్నిరకాల పనులకు సంబంధించిన నాణ్యతను క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే బిల్లులు చెల్లించేందుకు సిఫారసు చేస్తాం. పైపనులకు సంబంధించిన చెల్లింపులు ఇంకా చేయలేదు.

రైతు కుటుంబాలకు అండదండలు

(మొదటిపేజీ తరువాయి) కింద నిత్యావసర సరకులు అందేలా చూడాలన్నారు. కౌలుదారులు ఆత్మహత్యలకు పాల్పడితే వారసులకు రుణ అర్హత కార్డులను తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల భూమి మార్పిడికి సంబంధించిన విరాసత్ వారంలోగా పూర్తి చేయాలన్నారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి గతంలో తిరస్కరించిన అర్జీలను సైతం పునఃపరిశీలించాలన్నారు. భూమిలేని వారికి భూమి కొనుగోలు చేసి అందించేలా వీలుగా ప్రతిపాదనలు రూపొందించాలని తహసీల్దార్లకు సూచించారు. అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లతో సంప్రదించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబీకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సంధ్యారాణి, డీఆర్‌డీఓ జాన్సన్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి హనుమంతరావు, డీబీసీడీఓ పుష్పలత, కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ సమన్వయకర్త హర్ష, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు కొండల్‌రెడ్డి, జీవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్

వచ్చే ఏడాది మార్చి 18 నాటికి జిల్లాలో మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను పాలనాధికారిణి దివ్య ఆదేశించారు. మంగళవారం పరిపాలనా కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మిషన్ భగీరథ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే 17 మండలాల్లోని 970 గ్రామాల్లో 881 కిలోమీటర్ల పరిధిలో ట్యాంకుల నిర్మాణం చేపట్టామని, 1,888 కిలోమీటర్ల మేర పైపు లైన్ల పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ఇంకా 132 ట్యాంకుల పనులు, 330 కిలోమీటర్ల పైపులైన్ల నిర్మాణానికి వివిధ కంపెనీలకు ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమీక్షలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షకులు ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా కినుక... పింఛన్లు అందక!

(మొదటిపేజీ తరువాయి) జమ చేస్తున్నారు. ఇలా జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో 3,711 మంది, తాండూరు పట్టణంలో 6,353 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే మిగిలిన గ్రామీణ జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించి ఇప్పటివరకు 8,311 మందికి మాత్రమే పింఛన్లు చెల్లించారు. రెండు పురపాలక సంఘాల పరిధిలో మరో రూ.కోటి వరకు సొమ్ము చెల్లించి ఉండొచ్చని అంచనా. కాగా మిగిలిన సుమారు రూ.10 కోట్ల పింఛను మొత్తం బ్యాంకుల్లోనే మూలుగుతోంది. తపాలా శాఖ సిబ్బంది సమ్మెకు దిగడంతో గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సిబ్బందిలో కొంత మందిని పింఛన్ల పంపిణీకి పురమాయించారు. లక్ష మందికి డబ్బులు అందించడం వారితరం కాదన్నది స్పష్టమవుతోంది. తపాలా శాఖ సిబ్బంది సమ్మె విరమణ ప్రకటన వస్తే గానీ ప్రజల కష్టాలు తీరేలా కనిపించడం లేదు.

తొమ్మిది కిలో మీటర్లు వెళ్లాలి

-ఎం.అంతిరెడ్డి, నాగిరెడ్డిపల్లి

ప్రభుత్వ అందిస్తున్న ఆసర పింఛను కోసం ప్రతినెల నవాబుపేటలోని ప్రధాన తపాలా కార్యాలయానికి వెళ్లాల్సిందే. ఇందుకు రానుపోను తొమ్మిది కిలోమీటర్ల దూరం ప్రైవేటు వాహనాల్లో వెళుతున్నాం. తపాలా కార్యాలయానికి మాతోపాటు, వితంతువులు, వికలాంగులు వస్తున్నారు. ప్రతినెలా పింఛను పొందాలంటే ఉదయం వెళితే తిరిగి ఇంటికి వచ్చేసరికి సాయంత్రం అవుతోంది. ఏడు గ్రామాల లబ్ధిదారులు మండల కేంద్రానికి వస్తుండడంతో రద్దీ పెరుగుతోంది. వికలాంగులు, వృద్ధులకు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, గ్రామంలోనే అందజేయాలంటూ అధికారులకు తెలియజేసినా ఫలితంలేదు. మా గ్రామంలో ఇచ్చే ఏర్పాటు చేయాలి.

ఎప్పుడిస్తారో తెలియడం లేదు

-మాణెమ్మ, కేశవపల్లితండా

పోస్టలోళ్లు సమ్మెలో ఉన్నారని అంటున్నారు. ఈనెల పింఛిను ఎప్పుడొస్తరో తెలియడం లేదు. పింఛిని కోసం ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని నవాబుపేటకు వెళ్లాలి. అక్కడ సాధారణంగానే ఎక్కువ మంది ఉంటారు. ఇలాంటి సమయంలో అసలు నిలబడలేకుండా ఉన్నాం. నాలాంటి వారైతే మరొకరు తోడు లేకపోతే పింఛిను తెచ్చుకోలేం. ఈసారి ఎన్ని రోజులు తిరగాల్సి వస్తుందో మరి.

ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది

-జాన్సన్, డీఆర్‌డీఓ

తపాలా శాఖ సిబ్బంది సమ్మెలో ఉండటంతో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో తీవ్ర ఆలస్యం అవుతోంది. రాష్ట్రం మొత్తం ఇటువంటి సమస్యే ఉంది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటే దానికి అనుగుణంగా నడుచుకుంటాం. లబ్ధిదారులు భయపడాల్సిన అవసరం లేదు. అందరికీ తప్పకుండా అందిస్తాం.

మూగజీవాల అక్రమ రవాణాపై నిఘా

తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసిన పోలీసులు

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు డివిజన్ మీదుగా ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి తాండూరు డివిజన్‌కు అక్రమంగా మూగజీవాల రవాణాకు అడ్డుకట్టవేయడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. వచ్చేనెల 2న బక్రీద్ పండగ నేపథ్యంలో పోలీసులు ఇప్పటి నుంచే అప్రమత్తమయ్యారు. పండగను దృష్టిలో పెట్టుకుని రాజస్థాన్ నుంచి వందల ఒంటెలను తాండూరు మీదుగా మహబూబ్‌నగర్, కర్నూలు, కడప జిల్లాలకు పెద్దఎత్తున తరలిస్తారు. గడచిన ఐదారేళ్ల నుంచి తాండూరు మీదుగా ఒంటెల తరలింపు పెద్ద ఎత్తున సాగుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం అనారోగ్యానికి గురైతే తప్ప ఎద్దులు, ఇతర జంతువులను వధించవద్దని మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో పోలీసు యంత్రాగం అప్రమత్తం అయ్యింది. నియోజకవర్గం వ్యాప్తంగా నాలుగు చోట్ల తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించారు. సీఐలు, ఎస్సైలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని తాండూరు పట్టణ సమీపంలోని అంతారం గ్రామంతో పాటు కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఉన్న కొత్లాపూర్, పెద్దేముల్ మండలం మంబాపూర్, యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామ శివారులో మరో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తాండూరు పట్టణ సీఐ ప్రతాప లింగం తెలిపారు.



అంతారం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం

గేదెను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

యువకుడి మృతి

నార్సింగి, న్యూస్‌టుడే: చీకటిలో రోడ్డుపై వెళుతున్న గేదెను ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటనలో బైక్‌పై వెళుతున్న యువకుడు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గండిపేట సమీపంలోని శ్రీనగర్ రోడ్డుపై జరిగింది. నార్సింగి పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌కు చెందిన ఎండీ జాకీర్(30) అజీజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో బస్సుడ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం పని నిమిత్తం గండిపేటలోని బంధువుల ఇంటికి వచ్చి రాత్రి వేళ తన బైక్‌పై తిరిగి వెళుతుండగా శ్రీనగర్ వద్ద రోడ్డుపై గేదెను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బైక్‌పై నుంచి కిందపడిన జాకీర్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి... ఆరోగ్య పెన్నిధి!





న్యూస్‌టుడే, కోస్గి, కొడంగల్

ఎలాంటి పవిత్ర కార్యం ప్రారంభించినా ముందుగా వినాయకుడిని పూజించడం ఆనవాయితీ. వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని 21 రకాల పత్రాలతో పూజించి నిమజ్జనం చేస్తారు. దీన్లో ఎన్నో ఆరోగ్య రహస్యాలు, ప్రకృతి రక్షణ చర్యలు దాగిఉన్నాయని పూజారులు, పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. ఈనెల 25 వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయకులను పెద్దమొత్తంలో ప్రతిష్ఠిస్తారు. ఈ సందర్భంగా 21 రకాల పత్రాల విశిష్టతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.....

గణేషుకి 21 రకాల ఔషధ పత్రాలతో పూజలు



- **మాచీపత్రి:** గాలి కాలుష్యాన్ని నివారిస్తాయి. ఉబ్బసం, చర్మ, కంటి వ్యాధులను కలిగించే సూక్ష్మజీవులను నశింపజేసే ఔషధగుణాలు ఉన్నాయి.
- **బృహతీ పత్రం (వాకుడు మొక్క):** దంత వ్యాధులు, అజీర్తి, జ్వరం, జలుబు, మూత్రవ్యాధులను తగ్గించి, రోగ నిరోధక శక్తిని పెంచే గుణం ఈ పత్రాలకు ఉంది.



- **బిల్వ పత్రం (మారేడు):** కంటి వ్యాధులు, జ్వరం, మధుమేహం, కామెర్లు, శరీర దుర్గంధ నివారణలో మారేడు ఆకులు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.
- **దుర్వయుగ్మం (గరిక):** ఇనుము, విటమిన్లు కలిగి ఉంది. నాసికా సంబంధ, అజీర్తి, చర్మ, ఉదరకోశ వ్యాధుల నివారణ మందులలో గరిక ఉపయోగపడుతుంది.
- **దత్తూరపత్రం (ఉమ్మెత్త):** ఈ మొక్క మత్తును కలిగిస్తుంది. కీళ్లు, శరీర నొప్పులు, పేను కొరుకుడు, తలనొప్పి, శ్వాస సంబంధ వ్యాధులకు దీనిని ఉపయోగిస్తారు.
- **బదరీపత్రం (రేగు):** చిన్న పిల్లలకు వచ్చే పలు రకాల వ్యాధుల నివారణకు రేగు ఆకులు మంచి ఔషధంగా పనిచేస్తాయని పెద్దలు చెబుతారు.
- **అపామార్గ పత్రం (ఉత్తరేణి):** ఈ మొక్క పుల్లలను హోమంలో ఉపయోగిస్తే మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తాయని విశ్వసిస్తారు. జ్వరం, దంత వ్యాధులు, మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడంలో ఈ పత్రాలను వాడతారు.



- **తులసీ పత్రం:** ఓజోన్ వాయువును విడుదల చేస్తూ గాలిని శుభ్రపరుస్తుంది. ఈ మొక్క వాసనలకు పాములు దరిచేరవు. జలుబు, దగ్గు, ఖఫం, తుమ్ములు జ్వరం, మొటిమలు, గొంతు, చర్మ సంబంధ వ్యాధుల నివారణలో, ముఖ సౌందర్య లేపనాల తయారీలో విరివిగా ఉపయోగిస్తారు.
- **చూత పత్రం (మామిడి):** ఈ పత్రాలు ఆక్సిజన్ విడుదల చేసి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. మామిడి ఆకుల పొడి, పసుపు కలిపి కట్టుకడితే ఎంతటి గాయాలైనా మానుతాయని చెబుతారు. రక్త విరేచనాలు, చర్మవ్యాధులు, నోటిపూత, చిగుళ్లబాధను ఈ పత్ర ఔషధగుణాలు తొలగిస్తాయి.
- **కరవీర పత్రం (ఎర్రగన్నేరు):** దీని ఆకులు కాయలు విషపూరితం కావడం వలన సూక్ష్మజీవులను నశింపచేస్తాయి. తలవ్రెంటుకల సంరక్షణలో ఆకులు ఉపయోగపడతాయి. తేలు, విషపురుగుకాట్లు, కణితలు, దురదలను నిర్మూలిస్తాయి.
- **విష్ణుక్రాంత పత్రం:** ఇవి ఎక్కువగా వర్షాకాలంలో నీలిరంగు పుష్పాలతో కనిపిస్తాయి. జ్ఞాపకశక్తి పెంచడంలో, జలుబు, జ్వరం, ఉబ్బసం వ్యాధుల నివారణ మందుల తయారీలో ఈ పత్రాలు ఉపయోగపడతాయి
- **దామిడి పత్రం (దానిమ్మ చెట్టు):** దీని ఆకులు రక్త వృద్ధి, శరీరసౌష్టవం, దంత సౌందర్యాలను పెంచుతాయి. ముక్కు నుంచి రక్తస్రావం అరికట్టడంతో పాటు, గొంతునొప్పి, చర్మ వ్యాధులు, కండ్లకలక నయం చేయడంలో ఉపయోగపడతాయి.



- **దేవదారు పత్రం:** ఈ చెట్టు గాలి వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఆకులు కాలిస్తే ధూపం వాసన వస్తుంది. జ్ఞాపక శక్తి పెరగడానికి, అజీర్తి, ఉదరసంబంధ వ్యాధులు తగ్గడానికి తోడ్పడతాయి.
- **మరువక పత్రం (మరువం):** ఇది జుట్టు రాలడాన్ని తగ్గించి శ్వాసకోశ, చర్మవ్యాధులను నివారించడంతో పాటు ఆకలిని పెంచే గుణం కూడా ఉంది.
- **సింధువార (వాయిలిచెట్టు):** జలుబు, జ్వరం, తలనొప్పి కీళ్లనొప్పులు, మూర్ఛవ్యాధుల నివారణతో పాటు, మహిళల్లో ప్రసవానంతర బాధలను తగ్గిస్తాయి.
- **జాజిపత్రం (జాజిమల్లె):** దంపతుల మధ్య అనురాగాన్ని పెంచే గుణం ఇందులో దాగి ఉంది. జాపత్రిగ తాంబూలాలో ఉపయోగిస్తారు. కామెర్లు, నోటి పూత, దుర్వాసన, తలనొప్పి మటుమాయం చేయడంలో ఇవి ఉపయోగపడతాయి.
- **గండకీపత్రం (సీతాఫలం):** దీని పత్రాలు నులిపురుగుల నివారణలో, మూర్ఛ వ్యాధి నివారణ, వీర్యం, రక్తం వృద్ధికి వాడుతారు. వీటి గింజలపొడి తలలోని పేలను నివారిస్తుంది.
- **శమీపత్రం (జమ్మి వృక్షం):** దంత వ్యాధులు, అతిసారం, కుష్టు వ్యాధుల నివారణకు ఇవి ఉపయోగపడతాయి.



- **అశ్వపత్రం(రావిచెట్టు):** కంటి వ్యాధులు, అతిసారం, కామెర్లు, వాంతులు, మూత్ర సంబంధ వ్యాధుల నివారణలో ఉపయోగపడతాయి. రావి, వేప కలిసి ఉన్న చెట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే ఆరోగ్యకరమని నమ్ముతారు.
- **అర్జునపత్రం (తెల్లమద్ది):** వీర్యవృద్ధి, ధాతుగుణం, గుండె జబ్బు నివారణలో దివ్య ఔషధంగా పనిచేస్తాయి.



- **అర్కపత్రం (తెల్ల జిల్లేడు):** పక్షపాతం, కుష్టు, తిమ్మిర్లు, బోధ, చర్మ వ్యాధుల నివారణలో ఈ ఆకులు ఉపయోగపడతాయి.

జిన్‌గుర్తి.. సేంద్రియ సంపత్తి..!

అధిక దిగుబడులు సాధించాలన్న తపన.. పురుగులు, కీటకాల బారి నుంచి పంటలకు కాపాడుకునే తాపత్రయంలో రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడుతున్నారు. ఈ క్రమంలో దిగుబడులు పురుగు మందుల అవశేషాలతో ఉండటంతో అవిభుజిస్తున్న ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో సేంద్రియ సాగుకు ఎనలేని ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఇలాంటి ఉత్పత్తులకు విపణిలో మంచి డిమాండ్ ఉంటుంది. ఈ విషయాన్ని రైతులకు తెలియ చేయాలనే ఉద్దేశంతో ఏకలవ్య ఫౌండేషన్, ఓఎన్‌జీసీ ఆర్థిక సహకారంతో సేంద్రియ సాగుపై దృష్టిసారించింది. అంతేకాకుండా సేంద్రియ పంటలపై పరిశోధనలకు సైతం శ్రీకారం చుట్టనుంది. ఇందుకు అవసరమైన భవనాలు.. ఇతర నిర్మాణాలకు ఈనెల 26న కేంద్ర మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో సంస్థ సేంద్రీయ సాగుపై దృష్టి సారిస్తున్న తీరుపై 'న్యూస్‌టుడే' కథనం

- ఓఎన్‌జీసీ, ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంటల సాగు
- అందుబాటులోకి రానున్న వ్యవసాయ పరిశోధన భవనాలు
- నిర్మాణానికి 26న శంకుస్థాపన చేయనున్న కేంద్ర మంత్రులు



న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

ఏకలవ్య ఫౌండేషన్ తాండూరు మండలం జిన్‌గుర్తిలో 75ఎకరాల్లో తొలిసారిగా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేపట్టింది. ప్రస్తుతం కంది, పత్తి, పెసర, పసుపు, వరితోపాటు కూరగాయపంటలైన టమాటా, కాకర, మిరప, వంగ ఇక్కడ సాగు చేస్తున్నారు. టమాటాలు, కాకర దిగుబడులు ప్రస్తుతం చేతికొస్తుండగా వాటిని వారానికి ఒకసారి 2టన్నుల చొప్పున చిన్న లారీల్లో విక్రయానికి తాండూరు, హైదరాబాద్ తరలిస్తున్నారు. వంద ఎకరాల విస్తీర్ణంలోని వ్యవసాయ క్షేత్రంలో పంటలు సాగుచేస్తు పురుగు మందులు, రసాయన ఎరువుల స్థానంలో వేపకషాయం, పశువుల ఎరువులను వినియోగిస్తున్నారు.

శిక్షణ కార్యక్రమాలు..

సేంద్రీయ వ్యవసాయాన్ని యువ రైతులకు తెలియజేసి ప్రోత్సహించే ఉద్దేశ్యంతో డిప్లొమా కళాశాల సైతం ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం ప్రస్తుతం 45 మంది విద్యార్థులకు బోధన చేస్తున్నారు. వీరందరికీ వసతి కోసం గదుల నిర్మాణం చేపట్టారు. కోర్సు పూర్తయ్యాక వీరు సేంద్రియ సాగుపై గ్రామాలలో అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా తమ వ్యవసాయ క్షేత్రంలో వచ్చే యాసంగి సీజన్‌లో తీగజాతి కూరగాయలను సేంద్రియ సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తీగజాతి పంటల కింద 200 కోళ్ల పెంపకాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అడవులను పెంపొందించేందుకు గట్లమీద తబ్బీబంక, మోదుగపై లక్క కట్టేందుకు, 15 ఎకరాల్లో మొర్రి, వెదురు, తప్సి(అంటు) చెట్లను పెంచేందుకు నిర్ణయించినట్లు సంస్థ ప్రతినిధి రమాకాంత్‌రెడ్డి వెల్లడించారు.



నాటేందుకు సిద్ధంగా ఉంచిన మొక్కలు



భవనాలకు రంగులు.. నేల చదును పనులు..

మంత్రుల రాక..

ఓఎన్‌జీసీ, ఏకలవ్య ఫౌండేషన్ అధ్వర్యంలో జిన్‌గుర్తిలో ఏర్పాటైన సేంద్రియ వ్యవసాయ పరిశోధన, శిక్షణ కేంద్ర భవనాల పనులు ప్రారంభిచేందుకు కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఈనెల 26న రానుండటంతో సంస్థ ప్రతినిదులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కేంద్ర మంత్రితోపాటు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ సైన్స్(ఐఐసీటీ) విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ ఫార్మింగ్ సంస్థ ప్రతినిధులు రానున్నారు. 25న రాత్రి హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి చేరుకోనున్నారు. 26న ఉదయం 10గంటలకు కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారుదత్తాత్రేయ, ఎంపీలు కల్వకుంట్లకవిత, కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, రవాణశాఖ మంత్రి మహేందర్‌రెడ్డిలతో కలిసి జిన్‌గుర్తిలోని వ్యవసాయ క్షేత్రానికి రానున్నారు. అరగంటపాటు కేంద్రమంత్రి సేంద్రీయ సాగులోని పంటలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఆ తర్వాత పరిసరాల్లో నిర్మించతలపెట్టిన శిక్షణ, పరిశోధన కేంద్రాలకు సంబంధించి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని కేంద్ర మంత్రి ప్రసంగించనున్నారని ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి సోమవారం 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.

జోరుగా పనులు..

కేంద్ర మంత్రి పర్యటనకు సమయం దగ్గరపడుతుండటంతో ఇప్పటికే పూర్తయిన భవనాలకు రంగులు వేస్తున్నారు. కొత్తగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల్లోనూ వేగం పెంచారు. శౌచాలయాలు, మూత్రశాలలు నిర్మాణాలు త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. డిప్లొమా కోర్సులో చేరిన 45మంది విద్యార్థుల వసతి, బోధన సౌకర్యార్థం వీలుగా రెండంతస్తుల్లో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ క్షేత్రం మొత్తం 104ఎకరాల్లో విస్తరించి ఉండగా ప్రస్తుతం 75ఎకరాల్లో సేంద్రీయ సాగు చేపట్టారు. కేంద్ర మంత్రులు స్వయంగా కలియతిరిగి పంటపొలాలను పరిశీలించనున్నారు.



కందిలో అంతరపంటగా పెసర సాగు ఇలా..



అంతరపంటగా టమాట సాగు

మట్టి ప్రతిమ.. పర్యావరణ రక్షణ..!

- మూడేళ్ల నుంచి సహజ విగ్రహాల తయారీ
- యువతలో పెరుగుతున్న అవగాహన



వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వాములు అవుతున్నాయి. ప్రకృతిని కాపాడటంలోనే అందరి క్షేమం దాగి ఉందని గ్రహిస్తున్నారు. జిల్లా కేంద్రం వికారాబాద్‌లోని గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న యువకుడు ప్రవీణ్ గత మూడేళ్లుగా మట్టి వినాయకుల తయారీని వృత్తిగా మలుచుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను విక్రయించే ప్రవీణ్.. ఇప్పుడు డిమాండ్‌ను అనుసరించి మట్టి వినాయక విగ్రహాల తయారీపై దృష్టి సారిస్తున్నారు. మూడు సంవత్సరాలుగా చెరువుల్లో లభించే మట్టిని సేకరించి ప్రతిమలను తయారు చేసి పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దుకాణంలో రూ.25 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఇంటర్ వరకు చదివిన తను.. పర్యావరణానికి ఎలాంటి హాని కలించని మట్టి వినాయకులను తయారు చేస్తున్నట్లు వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగం పూర్తిగా తగ్గించాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.



తయారు చేసిన మట్టి వినాయకులు



ఎన్‌టీఆర్ చౌరస్తాలో మట్టి వినాయకులను తీసుకెళ్తున్న యువకులు

చిట్టి చేతులు.. మట్టి గణపతి..!

- 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిమల తయారీపై శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొన్న నాగసముందర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు



సదస్సులో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కుమార్

న్యూస్‌టుడే, ధారూర్

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమల్ని పూజించడం శ్రేయస్కారమని నాగసముందర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మట్టి గణేష్ ప్రతిమ తయారీపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. వినాయక చవితి రోజు ప్రతి ఇంట్లో, మండపంలో మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేయటం వల్ల నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ నీటిని తాగిన జలచరాలు, మూగజీవాలు రోగాల బారిన పడతాయన్నారు. అంతేకాకుండా మెర్క్యురీ, సీసం వంటి పదార్థాల వల్ల భూమి సారం కోల్పోతుందని వివరించారు.

గ్రామానికి ఒక్కటి చాలు..

వీధికో మండపం కాకుండా గ్రామానికి ఒక మండలం ఏర్పాటు చేసుకుని మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించుకుని పూజించాలని సూచించారు. మండపాల వద్ద ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వద్దు. . మట్టి ప్రతిమే ముద్దు అనే నిదానం ప్రదర్శించాలని సూచించారు. ఒకే మండపం వల్ల గ్రామస్థుల మధ్య ఐక్యమత్యం పెరుగుతుందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ అతి సులువుగా మట్టి వినాయకుడి ప్రతిమ తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఆయనతో పాటు పలువురు విద్యార్థులు అప్పటికప్పుడు మట్టి వినాయక ప్రతిమలను తయారు చేశారు. ఇక నుంచి మట్టి వినాయకుడినే పూజిస్తామని పేర్కొన్నారు.

ఖర్చు తగ్గుతుంది



యాదగిరి, ఉపాధ్యాయుడు నాగసముందర్.

ప్రస్తుతం గ్రామాలలో వినాయక ఉత్సవాలు పోటీపడి చేస్తున్నారు. ఒకరి వినాయకుడి కంటే మరొకరి వినాయకుడు పెద్దగా ఉండాలనే ఆలోచిస్తున్నారు. దీంతో ఖర్చు భారీగా పెరుగుతుంది. ఇలాంటి భారీ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. మట్టి తయారు చేసిన ప్రతిమ తక్కువ ధరకు లభిస్తుంది. ఖర్చు తక్కువ అవుతుంది.

నేల సారవంతం అవుతుంది



బి.కల్పన, ఉపాధ్యాయురాలు,

మట్టితో తయారు చేసిన ప్రతిమను పూజించిన తర్వాత నిమజ్జనం చేస్తే వెంటనే నీటిలో కరిగిపోతుంది. పూజకు ఉపయోగించిన పూలు, 27 రకాల పత్రిని చెరువులో వేయడం వల్ల క్రిమి కీటకాలు, బ్యాక్టీరియా నశిస్తాయి. నేల సారవంతం అవుతుంది. ఆ చెరువు మట్టిని పొలాలకు తరలిస్తే బంగారు పంటలు పండుతాయి.

మట్టి వినాయకులనే పూజిస్తాం: కె. శ్రీశైలం, విద్యార్థి.



మా పాఠశాలలో మట్టి వినాయకులను ఎలా తయారు చేయాలో బాగా వివరించారు. మేం సైతం తయారు చేస్తాం. మా ఇంట్లో వినాయక చవితికి ఈసారి మట్టి గణపతినే ప్రతిష్ఠిస్తాం. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తాం.



పాల్గొన్న విద్యార్థులు



మట్టి వినాయకుడి తయారీ వివరిస్తున్న ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్

కీలకమైనా కాలయాపనే!



- వర్సిటీల్లో పాలకమండళ్లులేక పనులు వాయిదా
- గాడితప్పుతున్న అభివృద్ధి
- కార్యకలాపాలపై ఆజమాయిషీ కరవు
- సమస్యలు పరిష్కారానికి నోచుకోని వైనం

ఈనాడు, హైదరాబాద్

విశ్వవిద్యాలయాల్లో ఏదైనా అత్యవసరమైన నిర్ణయం తీసుకోవాలన్నా వాయిదా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్ల నుంచి ఆయా వర్సిటీలకు పూర్తిస్థాయి పాలకవర్గాలు లేవు. తెలంగాణ ప్రభుత్వం వీసీలను నియమించి ఏడాది దాటింది. అయినా పాలకమండలి సభ్యులను ఇప్పటికీ భర్తీ చేయలేదు. దీంతో నిబంధనల ప్రకారం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా వీలుకావట్లేదు. ఫలితంగా వర్సిటీల్లో అభివృద్ధి పనులు అటకెక్కుతున్నాయి. నిధులను రాబట్టేందుకు ప్రభుత్వాన్ని అడిగేవారు లేకుండా పోయారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇటీవల శతాబ్ది ప్రారంభోత్సవాలు జరిగాయి. దీనికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్లు ప్రకటించింది. ఆ నిధుల్లో ఇప్పటికి కేవలం రూ.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. మిగతా రూ.150కోట్లు ఇప్పటివరకు ఇవ్వలేదు. వీటిగురించి ప్రభుత్వాన్ని అడిగే సాహసం ఎవరూ చేయట్లేదు. ఇటీవల న్యాక్ బృందం వర్సిటీలో పర్యటించింది. ఈ పర్యటనకు ముందే పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసి ఉంటే బాగుండేదని విద్యార్థిసంఘాల నాయకులు వివరిస్తున్నారు. జేఎన్‌టీయూహెచ్‌లోను న్యాక్ బృందం పర్యటించింది. ఇక్కడ పాలకవర్గం పూర్తి స్థాయిలో కొలువుదీరకపోవడంతో అరకొర పనులే పూర్తి అయ్యాయి. నిధులు రాబట్టడంలోనూ ఈ వర్సిటీ వెనకంజలోనే ఉంది.

అన్నింటికీ వాయిదాలే

నగరంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అన్నింటికీ దాదాపు పాలకమండళ్లు పూర్తిస్థాయిలో లేవు. అరకొర సభ్యులతోనే వర్సిటీల పాలన సాగుతోంది. సాధారణంగా వర్సిటీల్లో 13మందితో పాలకమండలి ఉంటుంది. అందులో వర్సిటీకి చెందిన వారు ముగ్గురు ఉంటారు. అనుబంధ కాలేజీల నుంచి ఇద్దరు, వివిధ రంగాల నిపుణులు నలుగురు ఉంటారు. వీరితోపాటు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నతవిద్యామండలి కమిషనర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, వీసీ పాలకమండలిలో ఉంటారు. ఏదైనా ఆర్థికపరమైన, కీలకమైన నిర్ణయాలు తీసుకోవాలంటే కోరం ఉండాలి. ఇదిలేక గత కొన్నేళ్ల నుంచి చాలాముఖ్య కార్యక్రమాలు వాయిదాపడుతున్నాయి. ఉదాహరణకు వర్సిటీల్లో అధ్యాపకుల ఖాళీలు భారీగా ఉన్నాయి. వీటిని ఒప్పంద అధ్యాపకులతోనైనా భర్తీ చేసే కీలక నిర్ణయం వాయిదాపడుతూనే వస్తోంది. శాశ్వత భర్తీలు గత కొన్నేళ్ల నుంచి జరగట్లేదు. దీంతో పాఠ్యాంశాలు పూర్తికాని పరిస్థితి ఉంది. విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. అభివృద్ధి పనులు పూర్తి చేయడంలోను వాయిదాలే ఎక్కువ. వీసీలు భర్తీ అయినప్పటికీ.. పాలకసభ్యులను ఇప్పటివరకు ప్రభుత్వం నియమించలేదు. దీంతో కోరంలేక చాలాపనులు వాయిదాపడుతున్నాయి. కొన్ని పనులను ముక్కలుగా విభజించి వీసీలు ఆమోదిస్తున్నారు. వర్సిటీల నిబంధనలకు ఇది విరుద్ధం. అయినా అత్యవసరమంటూ తరచూ ఇలానే పలు కార్యక్రమాలను పూర్తి చేస్తున్నారు.

నిధుల సమీకరణలోను లోటు..

తెలంగాణలోని పలు విశ్వవిద్యాలయాలకు గత కొన్నేళ్లుగా పాలకమండళ్లు లేక వాటి పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. తెలంగాణ ఏర్పాడి మూడేళ్లుదాటినా రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలకు పాలకమండలి సభ్యులను భర్తీ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. గత కొంతకాలంగా కేవలం ఎక్స్ అఫీషియో సభ్యుల ద్వారానే విశ్వవిద్యాలయాల పాలన నడుస్తోంది. చాలా యూనివర్సిటీలు సమావేశంలో కనీసం కోరం లేకుండానే నడుస్తున్నాయి. ఈ ఎక్స్ అఫీషియో సభ్యుల ద్వారానే అనేక నిర్ణయాలు తీసుకోవడంతో విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ జోక్యం అధికమవుతోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులు, వర్సిటీల్లో సమస్యలు తీర్చేందుకు నిధుల సమీకరణ తదితర విషయాల్లో పాలకమండళ్లు లేని లోటు తీవ్రంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో పలు వర్సిటీలకు వీసీలను భర్తీ చేసినా.. పూర్తి స్థాయి పాలకమండళ్లు లేక వారు కీలక నిర్ణయాలను తీసుకోలేని పరిస్థితులు తలెత్తాయి. వర్సిటీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకమండళ్లు లేక వర్సిటీలకున్న స్వతంత్ర ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారుతోందని పలువురు విద్యారంగ నిపుణులు వివరిస్తున్నారు.

'వజ్ర' కాంతులు!

- మినీ బస్సులకు పెరుగుతున్న ఆదరణ
- ఆర్టీసీ యత్నానికి జాతీయ స్థాయి గుర్తింపు



ఈనాడు, హైదరాబాద్

ప్రజల దగ్గరకు పాలనలా.. బస్సులూ జనం దగ్గరకి వెళ్తున్నాయి. నివాస ప్రాంతాల వరకూ వెళ్లి ప్రయాణికులను ఆహ్వానిస్తున్నాయి. ఊరెళ్లాలంటే.. ఇప్పుడు హైరానా పడాల్సిన పని లేదు. 'వజ్ర' పేరిట మినీ ఏసీ బస్సులు ప్రస్తుతం నేరుగా కాలనీలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజలకు మరింత చేరువై.. ప్రయాణికుల కష్టాలను తొలగించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ చేపట్టిన ఈ 'వజ్ర' సంకల్పానికి జనం ఫిదా అవుతున్నారు. కుటుంబ సమేతంగా ఇంటి నుంచి బయలుదేరి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి బస్సుస్టేషన్‌కు వెళ్లి ఊరెళ్లాల్సిన బస్సును పట్టుకోవడం ఎంత కష్టమో ఊహించవచ్చు. ఇప్పుడా ఇబ్బందులు తొలగాయని ప్రయాణికులు భావిస్తున్నారు. అందుకే ఆదరిస్తున్నారు. ఇదే ఆర్టీసీకి జాతీయ స్థాయి గుర్తింపును తెచ్చింది. ఫలితంగా ఆర్టీసీ అధికారులు ఈ సేవలను విస్తరించాలనే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రత్యేకతలివే...

- హైదరాబాద్ – వరంగల్ మధ్య ప్రతి 25 నిమిషాలకు ఒక బస్సు
- హైదరాబాద్ – నిజామాబాద్ మధ్య 35 నిమిషాలకు ఒక బస్సు
- హైదరాబాద్ – వరంగల్ మధ్య నడిచే వజ్ర బస్సుల టిక్కెట్ ధర రూ. 298లు
- హైదరాబాద్ – నిజామాబాద్ మధ్య నడిచే వజ్ర బస్సుల టిక్కెట్ ధర రూ.347లు
- హైదరాబాద్ – వరంగల్ జిల్లాల మధ్య 100 ట్రిప్పులు
- హైదరాబాద్ – నిజామాబాద్‌ల మధ్య 50 ట్రిప్పులు
- ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9.30 వరకూ సర్వీసులు

'ఆర్టీసీ లాభాల బాట పట్టాలి.. కొత్తగా ఆలోచించాలి.. సరికొత్త సేవలను అందుబాటులోకి తీసుకురావాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల సూచించారు. ఈ క్రమంలోనే 'వజ్ర బస్సులు' తేవాలని ఆర్టీసీ సంకల్పించింది. వాటిని కేసీఆర్ మేలో ప్రారంభించారు. మొదటగా నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు సర్వీసుల్ని ప్రారంభించారు. ఇలా హైదరాబాద్ నుంచి వరంగల్‌కు 50 మినీ బస్సులు.., అటు నుంచి ఇటు 50 బస్సులు నడుస్తున్నాయి. హైదరాబాద్ - నిజామాబాద్‌ల మధ్య ఇటు నుంచి 25.. అటు నుంచి 25 మొత్తం 50 బస్సులు తిరుగుతున్నాయి.



ఇటీవల దిల్లీలో అవార్డు అందుకున్న ఆర్టీసీ ఎండీ రమణరావు, ఇతర ఉన్నతాధికారులు

దేశంలోనే మొదటిసారిగా...

దేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టిన 'ప్రయాణికుల ముంగిట్లోకి ఆర్టీసీ బస్సులు' యత్నానికి జాతీయ స్థాయి అవార్డు వచ్చింది. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రజా రవాణా అవార్డు(నేషనల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎక్సలెన్సీ అవార్డు)ను ఆర్టీసీ ఎండీ రమణరావుతో పాటు.. ఇతర అధికారులు ఇటీవల దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అందుకున్నారు. ఇంటి దగ్గర్లో ఉన్న బోర్డింగ్ పాయింట్ దగ్గర బస్సు ఎక్కడం.. దిగడం.. ప్రయాణికులు అనువుగా భావిస్తున్నారు. టీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ డాట్ ఇన్ వెబ్‌సైట్లో ఆన్‌లైన్లో టిక్కెట్లు తీసుకోవచ్చు. టీఎస్ఆర్టీసీ యాప్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు.

బస్సు కదలికలు మొబైల్‌లో..

వజ్ర మినీ ఏసీ బస్సుల్లో ట్యాబ్‌ను అమర్చారు. ఈ ట్యాబ్ ద్వారా జీపీఎస్ విధానం అమలవుతోంది. బస్సు ఎక్కడ ఉంది. . ఎప్పుడు మన దగ్గరకు వస్తుందో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. ఆర్టీసీ నిర్దేశించిన బస్సు స్టాపులో ప్రయాణికులు ఉన్నారనే విషయం ఈ ట్యాబ్ డ్రైవర్‌కు గుర్తు చేస్తుంది.


మరిన్ని జిల్లాలకు, పట్టణాలకు విస్తరణ

ఈ బస్సుల్లో ప్రయాణించడానికి జనం అలవాటు పడుతున్నారు. వజ్ర మినీ బస్సులను మరిన్ని జిల్లాలకు, పట్టణాలకు విస్తరించే ఆలోచనలో ఆర్టీసీ ఉంది. త్వరలోనే కరీంనగర్, గోదావరిఖనికి ఈ బస్సులను నడుపుతామని ఆర్టీసీ ఎండీ రమణరావు ఇటీవల ప్రకటించారు. టీఎస్ఆర్టీసీ యాప్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకున్న మొదటి నలుగురు ప్రయాణికులకు ఒక్కో టిక్కెట్‌పై రూ.25 రాయితీ ఇవ్వడంతో మరింత ఆదరణ పెరిగిందని చెబుతున్నారు. మరో వారం రోజుల్లో ఆర్టీసీ డ్రైవర్ దగ్గర ఉన్న ట్యాబ్ ద్వారా టిక్కెట్ తీసుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

తవ్వకాలకు.. ఆన్‌లైన్‌లో అనుమతులు

- అతిక్రమిస్తే సంస్థలపై కేసు నమోదు
- జీహెచ్ఎంసీలో ఆన్‌లైన్ అనుమతుల విధానం

రోడ్డు రకం	రుసుము రూ.లలో (మీటరుకు)
సీసీ	1,844
బీటీ	2,275
పాదబాటలు	799
బెర్మ్/డబ్ల్యూబీఎం	285



ఈనాడు, హైదరాబాద్: రోడ్ల తవ్వకాల ప్రక్రియను సక్రమంగా జరిపేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. అందుకోసం ఆన్‌లైన్ అనుమతుల విధానాన్ని అందిపుచ్చుకుంది. దీని వల్ల పూర్తి ఆధారాలు పరిశీలించాకే రోడ్లను తవ్వేందుకు అనుమతి వస్తుంది. తవ్వకం పనులు ప్రారంభించే ముందే ప్రాంతం, ఏ రకం రోడ్డు అనే దాని ఆధారంగా బల్దియాకు రుసుము చెల్లించాలి. సకాలంలో పని పూర్తి చేసి రోడ్డును అప్పగిస్తే వెంటనే మరమ్మతులు చేస్తామని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.

జీహెచ్ఎంసీ అందిపుచ్చుకున్న 'ఆన్‌లైన్‌లో రోడ్డు తవ్వకం అనుమతులు' విధానం ఇటీవల రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. నిబంధనల ప్రకారం స్థానిక సంస్థ లేదా ఆర్అండ్‌బీ అనుమతి లేకుండా రోడ్లను తవ్వకూడదు. జీహెచ్ఎంసీ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా అంతర్జాల అనుమతుల ప్రక్రియను చేపట్టింది. ఆమేరకు ఇంజినీరింగ్ అధికారులకు ఉన్నతాధికారులు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. అనుమతుల్లేకుండా రోడ్లు తవ్వే వారిపై కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. అలా చేస్తేనే అనుమతులు తీసుకోడానికి ముందుకొస్తారని అన్నారు. ఇదే సమాచారాన్ని వేగంగా గుత్తేదారులకు చేరవేయాలన్నారు. సంస్థలకు ఈ నిబంధనలు అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నారు.


వారంలో అనుమతులు.. వారం రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. అనుమతి ఇచ్చే ముందు సంబంధిత సహాయక ఇంజినీరు లేదా కార్యనిర్వాహక ఇంజినీరు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారు చెప్పిన వివరాలు పరిశీలిస్తారు.

పక్కా ఉద్యోగమంటూ ఎంచక్కా దోపిడీ!



- 3, 6, 9, 12 నెలల శిక్షణకు పలు సంస్థల ఎర
- భారీగా ఫీజులు.. నియంత్రణ లేని వైనం
- నగరానికి చేరుతున్న వేలాది నిరుద్యోగులు
- కిటకిటలాడుతున్న శిక్షణ కేంద్రాలు

పేరుకేమో అవి శిక్షణ సంస్థలు.. వాటిలో చేరితే ఉద్యోగం సంగతి అటుంచితే ప్రతి సంస్థలో.. ప్రతి శాఖలో.. ప్రతి బ్యాచిలో వేలాది మంది అభ్యర్థులు.. కిక్కిరిసిన గదులు.. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు (12 గంటలపాటు) ఏకబిగిన శిక్షణ.. మైకు, స్పీకర్లతో బోధన.. నియంత్రణ లేని ఫీజులు.. లిఫ్టులు లేని భవంతులు.. మెట్లు ఎక్కి, దిగలేక అవస్థలు పడుతున్న నిరుద్యోగులు.. అడగడానికి అందుబాటులో ఉండని నిర్వాహకులు.. వెరసి ఇదీ.. నగరంలో శిక్షణ సంస్థల్లో నిత్యం జరుగుతున్న తంతు.



- సుమారు 85 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కసరత్తు
- 2,345 పోస్టులకు 9 ప్రకటనలను జారీ చేసిన టీఎస్‌పీఎస్సీ
- నగరంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు 3 లక్షలకుపైగా ఉన్నారు

ఈనాడు, హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సర్కారు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించింది. రెండేళ్లలో ఎన్నికలు రానున్నందున అన్ని శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి సర్కారు కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు నగరం బాటపట్టారు. బ్యాంకింగ్, బీమా రంగాల్లోనూ ఉద్యోగాల ప్రకటనలు వెలువడటంతో హైదరాబాద్‌కు చేరుతున్న నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. ఇదే అదనుగా పలు శిక్షణ సంస్థలు వారిని ఆకట్టుకొనే పనిలో పడ్డాయి. జాబ్ గ్యారంటీ పేరుతో ప్రవేశాలు ఇస్తున్నాయి. ఏడాదిపాటు ఉద్యోగం పొందేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటిస్తున్నాయి. ఉద్యోగం వచ్చేవరకు తమ సంస్థలోనే ఉచితంగా శిక్షణ పొందవచ్చని నమ్మబలుకుతున్నాయి. అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, చైతన్యపురి, కూకట్‌పల్లి, ఆర్టీసీక్రాస్‌రోడ్డు, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలకే పరిమితమైన సంస్థలు ప్రస్తుతం నగరమంతా వ్యాప్తించాయి. ఏదైనా కారణంతో ఇతర ప్రాంతానికి బస మారినా అక్కడ దగ్గరలోని తమ బ్రాంచీలో శిక్షణ పొందే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకుశిక్షణ కేంద్రాలు పలు విడతలుగా తరగతులు నిర్వహిస్తున్నాయి. ఒకే భవనంలో రోజులో నాలుగైదు విడతలుగా ఆయా సంస్థలు శిక్షణ ఇస్తున్నాయి. ప్రైవేటు ఉద్యోగాలు చేసుకొనే వారిని దృష్టిలో పెట్టుకొని నగరంలోని శిక్షణ సంస్థలు సమయాలను నిర్ణయిస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచి బోధన ప్రారంభిస్తున్నాయి. ఎక్కువ మంది విద్యారులు దీనిలోనే చేరుతున్నట్లు పలు సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

శిక్షణ సంస్థలకు ఎందుకింత గిరాకీ..

20 ఏళ్లకే డిగ్రీలు పూర్తి చేసి కొలువుల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగానికి రిజర్వేషన్ ఉన్నవారికైతే 40, 45 ఏళ్లు, ఓసీలైతే 35 ఏళ్ల వరకు ఆయా పరీక్షలు రాసే వెసులుబాటు ఉండటంతో ఆశావహులు లక్షల్లో ఉన్నారు. వీరిలో ఎక్కువమంది ఎప్పుడో యూజీ, పీజీలు పూర్తి చేసిన వారున్నారు. కొంత కాలంగా ప్రైవేటు ఉద్యోగాల్లో కొందరు చేరిపోగా మరికొందరైతే చిన్నచిన్న వ్యాపారలను సాగిస్తున్నారు. ఇలాంటివారంతా కొన్నేళ్లపాటు చదువుకు, పాఠ్యాంశాలకు దూరంగా ఉన్నారు. ఇలాంటివారంతా ప్రస్తుతం సర్కారు కొలువు దక్కించుకోవాలనే ఆలోచనతో శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. వీటిల్లో అయితే పరీక్షలను దృష్టిలో పెట్టుకొని బోధన సాగిస్తారని వీరి నమ్మకం. దీంతోపాటు ఆయా శిక్షణ సంస్థల్లో అయితే సంబంధిత పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అవే ఇస్తున్నాయి. అదే మెటీరియల్‌ను వ్యక్తిగతంగా బయట పుస్తక దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలన్నా రూ.వేలల్లో ఖర్చు అవుతుంది. అవసరమైనవి ఏవి అనేది ఎంపిక చేసుకోవడం వ్యక్తిగతంగా కష్టమే. అదే ఆయా సంస్థల్లో ఆయా పాఠ్యాంశ నిపుణులు వీటిని ఎంపిక చేసి అందిస్తారని అభ్యర్థుల నమ్మకం. ఇలాంటి పలుకారణాలతో ప్రస్తుతం నగరంలోని పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలకు మంచి గిరాకీ ఏర్పడింది.

ఏదో ఒక ఉద్యోగం షురూ..

ప్రస్తుతం వెలువడనున్న ఆయా శాఖల ఉద్యోగాల్లో ఏదో ఒకదానికి ఎంపికయ్యే వరకు ఉచితంగా శిక్షణ ఇస్తుండటంతో ఆయా సంస్థల్లో అభ్యర్థులు భారీగా చేరుతున్నారు. ఆయా సంస్థలు అభ్యర్థులను ఆకర్షించేందుకు పలు ప్రకటనలను గుప్పిస్తున్నాయి. పలు శిక్షణ సంస్థలు ప్రతి 15 రోజులకు ఒక బ్యాచ్‌ను ప్రారంభిస్తూ అభ్యర్థులను ఆకర్షిస్తున్నాయి. అభ్యర్థులకు అనువైన సమయాలను ఎంపిక చేసుకొనే వెసులుబాటుని అవి కల్పిస్తున్నాయి. వీటిల్లో శిక్షణ తీసుకుంటూనే ఏదోఒక ప్రైవేటు ఉద్యోగాలు చేసుకొనేవారూ ఉన్నారు. ఆయా సంస్థలు అభ్యర్థులను ఆకర్షించేందుకు 3, 6, 9, 12 నెలల కోర్సులను ప్రారంభించాయి. వీటితోపాటు ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం వచ్చేవరకు కొన్ని సంస్థలు శిక్షణ ఇస్తున్నాయి. వీటిల్లో శిక్షణ తీసుకుంటే బ్యాంకు, బీమా తదితర పోటీ పరీక్షలకు అవసరమైన బోధన అందిస్తున్నారు. నగరంలో పేరున్న సంస్థల్లో శిక్షణ పొందిన పలువురికి గతంలో కూడా ఉద్యోగాలు రావడంతో వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం నిరుద్యోగులు వీటిల్లో చేరుతున్నారు. ఇదే అదనుగా ఆయా సంస్థలు వీరిని జాబ్‌గ్యారంటీ పేరుతో ఆకట్టుకొని భారీగానే సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ సంస్థలు ఇచ్చే ప్రకటనలపై ఎవరి అజమాయిషీ లేదు. దీంతో నిరుద్యోగులను ఆకర్షించేందుకు ఆయా సంస్థలు బోగస్ ప్రకటనలకు తెరలేపుతున్నాయి. గతంలో ఆయా సంస్థల్లో ఉద్యోగం రాలేదంటూ నగరంలో పలు కేసులు నమోదైన సందర్భాలు ఉన్నాయి.

పర్యాటకమెరుగని విద్య!

- పట్టని విద్యాలయాలు.. శాఖ వద్ద లేని ప్రణాళికలు
- అవకాశాలున్నా వినియోగించుకోలేని వైనం
- పర్యాటకాభివృద్ధి ఎలానో తెలియని అధికారగణం



తెలంగాణ పర్యాటక బస్సులు

ఈనాడు – హైదరాబాద్

విద్యార్థులకు వికాసం కావాలి. ఇరుకు బడుల్లో నలిగిపోతున్న విద్యార్థి జీవితానికి వినోదం కావాలి. ఎప్పుడూ పుస్తకాలు.. తరగతి గదులేనా.. విహారం ఉండదా.. అంటే లేనట్టే. ఎంతసేపు మార్కులు.. ర్యాంకులు తప్పించి మరో ఆలోచన లేకుండా సాగిపోతున్న విద్యార్థులకు కాస్త ఆటవిడుపునివ్వాలి. కొన్ని విద్యాలయాలు ఆ ప్రయత్నం చేద్దామనుకుంటున్నా పిల్లల క్షేమం దృష్ట్యా పంపడానికి తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర పర్యాటక శాఖగానీ, పర్యాటకాభివృద్ధి సంస్థగానీ ముందుకు వస్తే తల్లిదండ్రులు నిశ్చింతగా పిల్లలను పంపడానికి సిద్ధంగా ఉంటారు. ఆ ప్రయత్నం జరగకపోవడంతో విజ్ఞాన, విహారయాత్రలు అటుకెక్కుతున్నాయి.

పర్యాటక ప్రచారం లేని సంస్థ..

ఎక్కడైనా పర్యాటక ప్రదర్శన జరిగితే రూ. లక్షలు వెచ్చించి అక్కడ స్టాల్ పెట్టడం.. అధికారులు వెళ్లడం.. తెలంగాణను సందర్శించడానికి రండహో.. అని దండోరా వేయడంతోనే తెలంగాణ పర్యాటకం సరిపెట్టుకుంటోంది. ఎంతటి ప్రచారం ఉంటే అంతగా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ఇదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఉన్న వేలాది పాఠశాలలు, కళాశాలలను ఆ శాఖ ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అధికారులకే తెలియాలి. ప్రత్యేక బస్సులున్నాయి.. సిబ్బంది ఉన్నారు.. హరిత హోటళ్ల వసతి ఉంది.. అయినా వీటిని వినియోగించుకోవాలనే ధ్యాస తెలంగాణ పర్యాటకానికి లేదు.

వెళ్లి అడిగినవారే కరవు..

నగరంలో వేల విద్యా సంస్థలుంటే.. తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఏడాది మొత్తంమ్మీద పర్యటనలకు తీసుకెళ్లే విద్యాలయాలు ఎన్ని అంటే పట్టుమని పది ఉండటం లేదు. పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి ఉన్న మార్కెటింగ్ సంస్థ ఏడాదిలో ఒక్కసారైనా ఏదో ఒక్క కళాశాలకు వెళ్లి మీ అవసరాలు ఏమిటి.. మీ విద్యార్థుల అభిరుచులేమిటి.. విహారంతోపాటు.. వికాసం ఉండేలా.. విజ్ఞాన యాత్రలు నిర్వహిస్తాం అని అడిగిన పాపాన పోలేదని ఆయా విద్యాలయాల ప్రిన్సిపళ్లే చెబుతున్నారు. ప్రైవేటు సంస్థలు వచ్చి ప్రాజెక్టు రిపోర్టు మాదిరి ఇస్తున్నాయని అంటున్నారు.

దోపిడీకి గురవుతున్న విద్యార్థులు..

తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ద్వారా అయ్యే యాత్ర ఖర్చుకు రెండింతలు ఎక్కువ ప్రైవేటు సంస్థలు తీసుకుంటున్నాయి. యాత్రకు సంబంధించిన వివరాలు విద్యార్థులకు ఇచ్చి.. తల్లిదండ్రుల నుంచి డబ్బులు ముక్కుపిండి వసూలు చేసి యాత్రలకు తీసుకెళ్తున్నారు. అందులో విద్యాలయాల బలవంతం ఏమీ ఉండదని.. రావాలనుకుంటే రావొచ్చని.. లేదంటే లేదని తెగేసి చెప్పేస్తున్నారు. తోటి విద్యార్థి వెళ్తున్నప్పుడు తమ పిల్లలు ఎలా వెళ్లకుండా ఉంటారని తల్లిదండ్రులు.. ప్రైవేటు టూరు ఆపరేటర్లు అడిగినంత చెల్లించి యాత్రలకు పంపుతున్నారు. ఉదాహరణకు.. ఓ ఇంజినీరింగ్ కళాశాల ఓ యాత్రను నిర్వహించింది. జలవిద్యుదుత్పత్తి అవుతుందో విద్యార్థులకు పరిచయం చేయడం అనేది ఉద్దేశం. కానీ శ్రీశైలంలో విద్యుదుత్పత్తి లేదు. అలాంటప్పుడు జూరాలకు తీసుకెళ్లాలి కదా.. అయినా ప్రతి విద్యార్థి దగ్గర రూ.2,500 వసూలు చేసి మమ అనిపించారు. ఇది ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి కోకొల్లలు. తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ రూ.2 వేలతో తీసుకెళ్లే యాత్రలను రూ.4 వేల చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకుని అందులో కొంత విద్యా సంస్థలకూ ముట్టజెబుతున్నాయి.

రాయితీలను అందిపుచ్చుకోలేని వైనం

విద్యార్థుల విహార యాత్రలకు కేంద్ర ప్రభుత్వం కొంత రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. రైలులో పర్యటించడానికి సగం టిక్కెట్ ధర చెల్లిస్తే సరిపోతుంది. ఇదే సమయంలో పాఠశాలల పిల్లలను తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపితే.. కొంతమేర నిధులు అందే అవకాశం ఉంటుంది. ఇలాంటి ప్రయత్నాలతో విద్యార్థులను తక్కువ టిక్కెట్ ధరతో విహార, విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లే అవకాశం ఉన్నా ఆ దిశగా పర్యాటకాభివృద్ధి సంస్థగానీ, పర్యాటక శాఖగానీ ప్రయత్నించిన దాఖలాలే లేవు. మా దగ్గరికి వస్తే తీసుకెళ్తామనే ఉద్దేశం తప్ప విద్యార్థుల అవసరాలను అధ్యయనం చేసి వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రకృతి ఒడిలోకి పిల్లలను తీసుకెళ్లాలనే ధ్యాసే లేకుండా తెలంగాణ పర్యాటకం పనిచేస్తోంది. అవకాశాలున్నా అందిపుచ్చుకోలేక తెలంగాణ పర్యాటకం చతికిలపడుతోంది.

- 425 ఏళ్ల పైబడిన చరిత్ర గల నగరం హైదరాబాద్
- నగరానికి చేరువలోనే పర్యాటక ప్రాంతాలు
- దాదాపు 80 ఏసీ బస్సులు
- రవాణా విభాగంలో 100 మంది సిబ్బంది
- ఇలా పర్యాటకాభివృద్ధి సంస్థలో అందర్నీ కలిపితే 750 మంది వరకూ ఉద్యోగులు
- నగరానికి చేరువలో 150 ఇంజినీరింగ్ కళాశాలలు
- గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో 6 వేల పాఠశాలలు
- గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో 2,500 జూనియర్, డిగ్రీ కళాశాలలు

పదోతరగతి

సాంఘికశాస్త్రం

భారతదేశం - భౌగోళిక స్వరూపాలు

★ పాఠ్యపుస్తకంలో అభ్యాసాల్లో ఇచ్చిన ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా పబ్లిక్ పరీక్షల్లో ఇవ్వరు. వాటిలో చాలా తక్కువ శాతం ప్రశ్నలు మాత్రమే రావచ్చు. కాబట్టి ఇచ్చిన ప్రశ్నల స్వభావం తెలుసుకుని, జవాబులు రాయాలి.

★ ఒకే ప్రశ్నను వివిధ రూపాల్లో అడిగే అవకాశం ఉంది. జవాబు చదివే సమయంలోనే దానిపై రకరకాల ప్రశ్నలను తయారు చేసి పెట్టుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

★ ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలో, ఎలా రాయాలో తెలుసుకుని వాటిపై పట్టు సాధిస్తే పరీక్షలో ఎలాంటి ప్రశ్నకైనా తేలికగా జవాబు రాయగలుగుతారు.

ప్రతిభ

ఒక మార్కు ప్రశ్నలు

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.



ప్ర: దక్కన్ పీఠభూమి సరిహద్దులను రాయండి.

జ. ఉత్తరాన: సాత్పురా పర్వతాలు, దక్షిణాన: నీలగిరి పర్వతాలు, తూర్పున: తూర్పు కనుమలు; పశ్చిమాన: పశ్చిమ కనుమలు దక్కన్ పీఠభూమికి సరిహద్దులుగా ఉన్నాయి.

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.

హిమాలయాలు - సమాంతర శ్రేణులు

	హిమాద్రి శ్రేణి	నిమ్న హిమాలయాలు	శివాలిక్ శ్రేణి
ఎత్తు	6100 మీ.	3700–4500 మీ.	900 – 1100 మీ.
ఉనికి	హిమాలయాల్లో అన్నిటి కంటే ఉత్తరాన ఉంది.	హిమాద్రి, శివాలిక్ శ్రేణుల మధ్యలో ఉంది.	అన్నింటి కంటే దక్షిణాన ఉన్న శ్రేణి

ప్ర: హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి ఏది? దానికి ఉన్న మరో పేరేమిటి?

జ. 'హిమాద్రి శ్రేణి' హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి. దీనికి మరోపేరు 'ఉన్నత హిమాలయాలు.'

దేశంలో అత్యంత పొడవైన కాలువ..?



రచయిత
బొమ్మిడి నారాయణరావు
విషయ నిపుణులు

ప్ర: దేశంలో అత్యంత పొడవైన కాలువ ఏది? ఇది ఏ రాష్ట్రానికి నీరు అందిస్తుంది?

జ. దేశంలో అత్యంత పొడవైన కాలువ ఇందిరా గాంధీ కాలువ. ఇది ముఖ్యంగా రాజస్థాన్‌కు నీరు అందిస్తుంది.

ప్ర: శివాలిక్ పర్వతాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న పేర్లను తెలపండి.

జ. జమ్మూ ప్రాంతంలో జమ్మూ కొండలనీ, అరుణాచల్ ప్రదేశ్‌లో మిష్మి కొండలనీ, అసోంలో కచార్ అనీ పిలుస్తారు.

ప్ర: డూన్ అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.

జ. నిమ్న హిమాలయాలు, శివాలిక్ శ్రేణుల మధ్య ఉండే లోయలను స్థానికంగా 'డూన్'లు అంటారు

ఉదా: డెహ్రాడూన్.

ప్ర: 'భారతదేశం ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఎందుకు ఉపయోగిస్తారు?

జ. భారతదేశానికి మూడువైపులా నీరు ఉన్న కారణంగా, దక్షిణ భారతదేశాన్ని ఉద్దేశించి 'ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఉపయోగిస్తారు.

ప్ర: అండమాన్ నికోబార్ దీవుల్లో అగ్ని పర్వతాల వల్ల ఏర్పడిన దీవులేవి?

జ. నార్కొండం, బారెన్ దీవులు అగ్ని పర్వతాల వల్ల ఏర్పడ్డాయి.

ప్ర: ప్రపంచ పటంలో భారతదేశాన్ని గుర్తించాలంటే ఏయే అక్షాంశ, రేఖాంశాలు మనకు తెలియాలి?

జ. $8^\circ 4' – 37^\circ 6'$ ఉత్తర అక్షాంశాలు, $68^\circ 7' – 97^\circ 25'$ తూర్పు రేఖాంశాలు మనకు తెలిస్తే, ప్రపంచ పటంలో భారతదేశాన్ని సులభంగా గుర్తించవచ్చు.

ప్ర: రెండు నదుల మధ్య ప్రాంతాన్ని ఏమని అంటారు?

జ. రెండు నదుల మధ్య ప్రాంతాన్ని 'అంతర్వేది' అని అంటారు.

ప్ర: గోవా వెళితే మనకు తారసపడే తీర ప్రాంతమేది?


జ. గోవా వెళితే మనకు కొంకణ తీరం తారసపడుతుంది.

ప్ర: పూర్వాంచల్ పర్వతాలు అని వేటిని పిలుస్తారు?

జ. భారతదేశానికి తూర్పు సరిహద్దుగా ఉన్న హిమాలయాలను పూర్వాంచల్ పర్వతాలు అంటారు.

ప్ర: కింది చిత్రంలో పేర్కొన్న పగటి సమయాలను పరిశీలించి, వాటికి సంబంధించిన నగరాలను (ఢిల్లీ, లండన్) గడుల్లో రాయండి.

జ.



నాలుగు మార్కుల ప్రశ్న

ప్ర: 'భారతదేశంలోని మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' - ఈ వాక్యాన్ని ఎలా సమర్థిస్తారు?

జ. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర వాటి ఉప నదుల వల్ల విశాల ఉత్తర మైదానం ఏర్పడింది. హిమాలయాల నుంచి వచ్చే ఈ నదులు తెచ్చిన రకరకాల ఒండ్రుమట్టి వల్ల ఇది క్రమేపీ పూడుకుంటూ వచ్చింది. అందువల్ల ఇక్కడి నేలలు అధిక భూసారంతో ఉండి, ఎక్కువ దిగుబడిని ఇస్తాయి.

✪ పీఠభూమి ప్రాంతాలు అగ్నిపర్వత శిలలతో ఏర్పడ్డాయి. ఇవి ఉత్తర మైదాన ప్రాంతాలంత సారవంతమైనవి కావు.

✪ ఉత్తర మైదాన ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు. ఇవి ఎప్పుడూ నీటితో ఉంటాయి.

✪ దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు కావు. ఇక్కడ రెండో పంటకు సాగు నీటి కోసం చెరువులు, బోరు బావులపై ఆధారపడవలసి వస్తుంది.

✪ మైదాన ప్రాంతాల్లో ఉన్న సౌకర్యాలు పీఠభూమి ప్రాంతాల్లో ఉండవు. అందువల్ల 'భారతదేశంలోని ఉత్తర మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' అనే వాక్యాన్ని నేను సమర్థిస్తాను.

ముఖ్యమైన ప్రశ్నలు

1) తూర్పు, పశ్చిమ తీర మైదాన ప్రాంతాల మధ్య పోలికలు, తేడాలను రాయండి.

2) హిమాలయాలు భారతదేశానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి?

3) భాబర్, టెరాయిల మధ్య తేడాలను రాయండి.

BANK EXAMS

General Awareness

Sovereign Gold Bonds issued by..



Writer:
A. Veeraswami
Subject Expert

1. Sovereign Gold Bond 2017 – 2018 Series II issued as per the announcement of RBI on 6 July 2017. These bonds issued by RBI on behalf of ....
1) SBI 2) World Bank
3) Muthoot Finance
4) Government of India 5) SEBI

2. The SGB (Sovereign Gold Bond) issued to the buyers on ....
1) 23 July 2) 31 July 3) 1 August
4) 13 July 5) 28 July

3. The RBI sold the SGB to buyers through .....
1) banks 2) designated Post Offices
3) recognized Stock Exchanges
4) Stock Holding Corporation of India Limited (SHCIL) 5) All of above

4. The person / entity eligible to buy SGB Bonds is / are ....
1) Individuals 2) HUFs 3) Trusts
4) Universities and Charitable Institutions
5) All of above

5. SGB will be denominated in multiples of gram(s) of gold with a basic unit of ....
1) 3 grams 2) 8 grams 3) 10 grams
4) 1 gram 5) 12 grams

6. Under the Sovereign Gold Bond 2017 - 18 Series II, instead of buying physical gold, Indian residents can buy the Gold Bonds. These Bonds would be issued for the term of 8 years with exit option from ....
1) 5th year 2) 1st year 3) 4th year
4) 2nd year 5) 3rd year

7. Maximum amount of gold that can be subscribed by person / HUF per fiscal year under SGB scheme as announced on 26 July 2017 is ....
1) 100 gms 2) 1000 gms 3) 4000 gms
4) 2000 gms 5) 250 gms

8. Maximum amount of gold that can subscribe by trust and similar entities in SGB scheme as per the notification given by the government is ....
1) 50 kgs 2) 80 kgs 3) 20 kgs
4) 40 kgs 5) 30 kgs

9. Wrong statement regarding SGB (Sovereign Gold Bond) scheme is ....
1) Bonds are eligible for conversion into DEMAT form
2) Bonds will be tradable on stock exchanges
3) the interest accrued on Gold Bonds shall not be taxable under Income Tax Act,1961
4) Capital gains tax arising on redemption of SGB to an individual has been exempted
5) KYC (Know Your Customer) compulsory to buy

10. Under the Sovereign Gold Bonds 2017-18 Series Scheme, investors earn interest rate up to .... payable semi-annually on the initial value of investment.
1) 2.50 % per annum 2) 1.50 % per annum
3) 8.50 % per annum 4) 4.50 % per annum
5) 7.50 % per annum

11. SGB can be used as collateral for loans and for this purpose LTV ratio is to be set equal to ordinary gold loan mandated by the RBI from time to time. In this context, LTV stands for ....
1) LIBOR-to-value 2) linked-to-value
3) liability-to-value 4) loan-to-value
5) locker rent-to-value

12. On 6 July 2017, RBI released Compendium of Guidelines for Small Finance Banks - Financial Inclusion and Development. As per it, Small Finance Banks required to open at least .... of its branches in unbanked rural centers
1) 5% 2) 40% 3) 50% 4) 15% 5) 25%

13. Small Finance Banks required to extend 75% of its ANBC to priority sector. In this context, ANBC stands for ....
1)Average Net Bank Credit
2)Adjusted Net Batch Credit
3) Adjusted Nil Bank Credit
4) Adjusted Net Bank Credit
5) Allotment Net Bank Credit

14. Total Agricultural advances must be .... of ANBC given by Small Finance Banks
1) 24% 2) 60% 3) 15% 4) 32% 5) 18%

15. Within the 18 percent target for Agriculture, a target of .... of ANBC is prescribed for Small and Marginal Farmers by Small Banks.
1) 4% 2) 6% 3) 8% 4) 2% 5) 1%

16. Advances to weaker sections is the part of Priority Sector holding. What percentage of ANBC must be given to weaker section people by the Small Finance Banks (SFB)?
1)10% 2) 20% 3) 25% 4) 15% 5) 12%

17. A target of .... percent of ANBC must be given to micro enterprises as part of Priority Sector Lending by SFBs.
1) 7.5% 2) 10.5%
3) 6.8% 4) 8.2% 5)10.5%

18. Operating Guidelines for Small Finance banks issued by RBI on 6 October 2016. The guidelines for Licensing of Small Finance Banks earlier passed by RBI on...
1) 1 June 2016 2) 26 February 2016
3) 1 February 2014 4) 21 December 2015
5) 27 November 2014

19. Minimum Capital Requirement for Small Finance Banks is .... as per the guide lines issued on 6 October 2016.
1) 9% 2) 10% 3) 15% 4) 21% 5) 11.5%

20. Tier 1 common capital ratio is a measurement of a bank's core equity capital compared with its total risk-weighted assets that signifies a bank's financial strength. As per operating guidelines, for Small Finance Banks, the Common Equity Tier 1 is .... ?
1) 7% 2) 8.5% 3) 10% 4) 9.8% 5) 6%

21. The Minimum paid-up equity capital for small finance banks shall be.....?
1) Rs.1,000 crore
2) Rs.5,000 crore 3) Rs.500 crore
4) Rs.10 crore 5) Rs.100 crore

Key

1-4	6-1	11-4	16-1	21-5.
2-5	7-3	12-5	17-1	
3-5	8-3	13-4	18-5	
4-5	9-3	14-5	19-3	
5-4	10-1	15-3	20-5	

ప్రతిభ

ఉద్యోగాలు Jobs



ముఖ్యమైన తేదీలు

★ హార్టిసెట్ - 2017కు దరఖాస్తు చేయడానికి: *31 ఆగస్టు*
★ ఇస్రోలో అప్రెంటీస్ ఖాళీలకు దరఖాస్తు చేయడానికి: *2 సెప్టెంబరు*
★ దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డులోని ఖాళీలకు: *15 సెప్టెంబరు*
★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయడానికి: *4 సెప్టెంబరు*

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ టెక్నికల్ అప్రెంటిసెస్ (డిప్లొమా హోల్డర్లు) పోస్టుల భర్తీకి వాక్- ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది.

✦ ఖాళీలు: టెక్నీషియన్ అప్రెంటిసెస్ - 310.
✦ వ్యవధి: ఏడాది.
✦ విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్/ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ సివిల్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్.
✦ అర్హత: సంబంధిత విభాగంలో (2015 తర్వాత) డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
✦ వయసు: 1 ఆగస్టు 2017 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
✦ స్టయిపెండ్: నెలకు రూ.4000 చెల్లిస్తారు.
✦ ఎంపిక: 21 ఆగస్టు నుంచి 31 ఆగస్టు వరకు నిర్వహించే ఇంటర్వ్యూల ఆధారంగా.
✦ ఇంటర్వ్యూ వేదిక: భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ డివిజన్, మైసూరు రోడ్, బెంగళూరు - 560026.
✦ అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలతో ఇంటర్వ్యూకి హాజరుకావొచ్చు.

చివరి తేదీ: ***31 ఆగస్టు***
వెబ్‌సైట్: **www.bheledn.com**

ఇస్రోలో ఖాళీలు

మహేంద్రగిరి (తమిళనాడు)లో ఇస్రోకి చెందిన ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ ట్రేడ్ అండ్ టెక్నీషియన్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మొత్తం ఖాళీలు: 139 (ట్రేడ్ అప్రెంటీస్ - 80, టెక్నీషియన్ అప్రెంటీస్ - 59)
✦ అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్/ బ్రాంచ్‌లో ఐటీఐ/ ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
✦ వయసు: 35 ఏళ్లకు మించకూడదు.
✦ ఎంపిక: అకడెమిక్ మెరిట్ ఆధారంగా.
✦ దరఖాస్తు: వెబ్‌సైట్‌లో సూచించిన నమూనాలో పూర్తి వివరాలు జత చేసి పంపాలి.
✦ చిరునామా: ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ), మహేంద్రగిరి, తిరునల్వేలి జిల్లా, తమిళనాడు

✦ చివరి తేదీ: ***2 సెప్టెంబరు***
✦ వెబ్‌సైట్: **www.iprc.gov.in**

ఐఐటీ, మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మొత్తం ఖాళీలు: 32.
✦ రిజిస్ట్రార్ - 1.
✦ సిస్టమ్స్ ఇంజినీర్ - 1.
✦ సెక్యూరిటీ ఆఫీసర్ - 1.
✦ జూనియర్ ఇంజినీర్ - 3.
✦ స్టాఫ్ నర్స్ - 4
✦ జూనియర్ టెక్నీషియన్ - 12.
✦ జూనియర్ అసిస్టెంట్ - 10.
✦ దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 8 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.iitm.ac.in**

మరింత విద్యా ఉద్యోగ సమాచారం కోసం చూడండి..
www.eenadupratibha.net

ఇస్రోలో అప్రెంటీస్‌లు...

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు పలు విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మొత్తం ఖాళీలు: 15116
✦ జూనియర్ ఇంజినీర్ (సివిల్ - 70, మెకానికల్ - 15)
✦ పట్వారీ - 140
✦ లీగల్ అసిస్టెంట్ - 13
✦ స్పెషల్ ఎడ్యుకేటర్ - 1540
✦ ప్రైమరీ టీచర్ - 4366
✦ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ - 496
✦ అసిస్టెంట్ టీచర్ (నర్సరీ - 320, ప్రైమరీ - 1394)
✦ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ - 919
✦ డ్రాయింగ్ టీచర్ - 295
✦ డొమెస్టిక్ సైన్స్ టీచర్ - 199
✦ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ): హోమ్‌సైన్స్ - 114, ఫిజికల్ ఎడ్యుకేషన్ - 160, ఫైన్ ఆర్ట్ - 30, మ్యూజిక్ - 1, బయాలజీ - 15, కెమిస్ట్రీ - 21, కామర్స్ - 28, ఎకనామిక్స్ - 32, ఇంగ్లిష్ - 156, హిందీ - 179, హిస్టరీ - 205, పొలిటికల్ సైన్స్ - 203, సంస్కృతం - 48, జాగ్రఫీ - 69, మ్యాథ్స్ - 20, ఫిజిక్స్ - 18, పంజాబీ - 3, ఉర్దూ - 2, అగ్రికల్చర్ - 1, సోషియాలజీ - 83.
✦ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ): ఇంగ్లిష్ - 678, మ్యాథ్స్ - 610, నేచురల్ సైన్స్ - 416, సోషల్ సైన్సెస్ - 603, బెంగాలీ - 1, హిందీ - 422, పంజాబీ - 214, సంస్కృతం - 254, ఉర్దూ - 213.
✦ ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ గైడెన్స్ కౌన్సెలర్ - 432
✦ మ్యూజిక్ టీచర్ - 46
✦ దరఖాస్తు: 25 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
✦ ఎంపిక: రాతపరీక్ష (టైర్ - 1, టైర్ - 2) ఆధారంగా.

✦ చివరి తేదీ: ***15 సెప్టెంబరు***
వెబ్‌సైట్: **dsssonline.nic.in**

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ ఖాళీలు: రిస్క్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్స్ - 7 (క్రెడిట్ రిస్క్ - 3, ఆపరేషనల్ రిస్క్ - 2, మార్కెట్ రిస్క్ - 2)
✦ అర్హత: ఏదైనా డిగ్రీతోపాటు ఎంబీఏ/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ
✦ వయసు: 30 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
✦ **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
✦ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) - 1. సీఏ ఉత్తీర్ణతతోపాటు 15 ఏళ్ల అనుభవం అవసరం.
✦ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో) - 1. ఇంజినీరింగ్ డిగ్రీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణులైనవారు అర్హులు. అనుభవం ఉండాలి.
✦ ప్రిన్సిపల్ - స్టాఫ్ ట్రెయినింగ్ కాలేజ్ - 1. ఎకనామిక్స్/ కామర్స్‌లో పీజీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంబీఏ (ఫైనాన్స్)/ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
✦ దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 2 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
✦ ఎంపిక: రాతపరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 12 సెప్టెంబరు
✦ చిరునామా: ది అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఐఆర్ అండ్ హెచ్‌ఆర్‌డీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లోక్‌మంగల్, 1501, శివాజీ నగర్, పుణె - 411 005

✦ వెబ్‌సైట్: **www.bankofmaharashtra.in**

టీచింగ్ పోస్టులు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మొత్తం ఖాళీలు: 16
✦ టీచింగ్ - 9. ప్రొఫెసర్ - 1, అసోసియేట్ ప్రొఫెసర్ - 3, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 5

అర్హత: 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీతోపాటు పీహెచ్‌డీ, బోధన/ రిసెర్చ్‌లో అనుభవం అవసరం.

నాన్ టీచింగ్ పోస్టులు: 7

✦ సైకియాట్రిక్ సోషల్ వర్కర్ - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ - 1, స్టెనోగ్రాఫర్ - 5.
✦ ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✦ చివరి తేదీ: ***31 ఆగస్టు***
వెబ్‌సైట్: **www.tiss.edu**

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ ఖాళీలు: 36
✦ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (హెచ్‌ఆర్) - 12. అర్హత: 60 శాతం మార్కులతో ఎంబీఏ/ పీజీ డిగ్రీ లేదా పర్సనల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్‌ఆర్ లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
✦ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్) - 24. అర్హత: 60 శాతం మార్కులతో ఎంఎస్సీ (అగ్రికల్చర్) లేదా తత్సమాన అర్హత అవసరం. లేదా మార్కెటింగ్/ అగ్రిబిజినెస్ మార్కెటింగ్/ ఇంటర్నేషనల్ మార్కెటింగ్/ రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ/ పీడీడీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.
✦ ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

✦ చివరి తేదీ: ***6 సెప్టెంబరు***
వెబ్‌సైట్: **www.nationalfertilizers.com**

అసిస్టెంట్ ప్రొఫెసర్లు


హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 224 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ అగ్రికల్చర్ - 186 (6 లైబ్రరీ సైన్స్ పోస్టులతో కలిపి).

అర్హత: అగ్రికల్చరల్ ఎకనామిక్స్/ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్/ అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ/ ఆగ్రోనమీ/ క్రాప్ ఫిజియాలజీ/ ఎంటమాలజీ/ జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్/ హార్టికల్చర్/ ప్లాంట్ పాథాలజీ/ ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ/ సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ/ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)లో అర్హత సాధించి ఉండాలి.

లైబ్రరీ సైన్స్ పోస్టులకు లైబ్రరీ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ డాక్యుమెంటేషన్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత అవసరం.

✦ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 22, హోమ్‌సైన్స్ - 16.
✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 20 సెప్టెంబరు వరకు.
✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: **29 సెప్టెంబరు**
✦ **హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ బ్యాక్‌లాగ్ (ఎస్సీ, ఎస్టీ) పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
✦ ఖాళీలు: అగ్రికల్చర్ - 10, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 5, హోమ్ సైన్స్ - 3
✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 12 సెప్టెంబరు వరకు.



✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: ***29 సెప్టెంబరు***
వెబ్‌సైట్: **www.pjtsau.ac.in**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్లు (బ్యాక్‌లాగ్ - 178, రెగ్యులర్ - 20)
✦ విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్.
✦ అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ, పీహెచ్‌డీ లేదా తత్సమాన అర్హత అవసరం.
✦ వయోపరిమితి: 1 జులై 2017 నాటికి 40 సంవత్సరాలకు మించకూడదు.
✦ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

✦ చివరి తేదీ: ***4 సెప్టెంబరు***
వెబ్‌సైట్: **dme.ap.nic.in**

ప్రవేశాలు

హార్టిసెట్ - 2017

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చరల్ యూనివర్సిటీ 2017 - 18 విద్యాసంవత్సరానికి బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించే 'హార్టిసెట్ - 2017' కు నోటిఫికేషన్ విడుదల చేసింది.

✦ సీట్ల సంఖ్య: 23.
✦ అర్హత: హార్టికల్చర్ డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
✦ వయసు: 31 డిసెంబరు 2017 నాటికి 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్నవారై ఉండాలి.
✦ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
✦ పూర్తి చేసిన దరఖాస్తుకు కంప్ట్రోలర్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, రాజేంద్రనగర్, హైదరాబాద్ పేరిట చెల్లేలా తీసిన రూ.750 డీడీ (ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్ అభ్యర్థులు రూ.350) జత చేసి పంపాలి.
✦ పరీక్ష తేదీ: 18 సెప్టెంబరు

✦ చివరి తేదీ: 31 ఆగస్టు
వెబ్‌సైట్: **www.skltshu.ac.in**

హాయ్! బుజ్జీ!!



2034లో మీ దగ్గరా చూడొచ్చు!

◆ హాయ్... సూర్యుడు గారూ! నాపేరు కిట్టూ! హాయ్‌బుజ్జీ తరఫున మిమ్మల్ని సరదాగా పలకరిద్దామని వచ్చా. 'నా గురించి తెలియనిదేముందబ్బా?' అనుకుంటున్నారేమో కానీ మరేమీ లేదు.. రెండు మూడు రోజులుగా అంతా మీ సంగతులే మాట్లాడుతున్నారు... అమెరికాలో, ప్రసార మాధ్యమాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం అంటూ హల్‌చల్ నడిచింది. అవునుగానీ ఇంతకీ మీరు మా దగ్గర ఇలా ఎప్పుడు కనిపిస్తారేంటి?

▶ నన్ను కలవడానికి వచ్చినందుకు చాలా సంతోషం కిట్టూ. మీ దగ్గర నా సంపూర్ణ సూర్యగ్రహణం చూడాలంటే 2034 వరకు ఆగాల్సిందే. లేదంటే 2019లో దక్షిణ అమెరికా దేశాల దగ్గర కనిపిస్తానిలా. అప్పటిలోగా నా గ్రహణం గురించి మీ శాస్త్రవేత్తలేమైనా కొత్త విషయాలు తెలుసుకుంటారేమో చూద్దాం.

◆ అవును నాకూ ఉత్సాహంగానే ఉంది. అది సరే... మరి ఇప్పటి సూర్యగ్రహణం సంగతులు ఏంటి?

▶ ఆ విషయానికే వస్తున్నా. కానీ ఇంకాస్త దూరంగా నిలబడు! లేదంటే నా వేడిని తట్టుకోలేవు. భూమికీ, నాకూ మధ్య చంద్రుడు వచ్చినప్పుడు, మీ భూమిపై కొంత భాగంలో నేను కనిపించను. దాన్నే సూర్యగ్రహణం అంటారని వినే ఉంటావుగా. అత్యంత ప్రకాశవంతంగా వెలిగే నేను చంద్రుడి ఛాయ వల్ల ఒక సన్నటి అంచులా కనిపిస్తా. అప్పుడు ఆ ప్రదేశంలో మాత్రం సూర్యగ్రహణం కనిపిస్తుంది. ఇప్పుడు అమెరికాలో జరిగింది అచ్చంగా ఇదేనన్నమాట.

◆ అయితే ఈసారి వచ్చిన సంపూర్ణ గ్రహణం దాదాపు 99 ఏళ్ల తర్వాత ఏర్పడిందటగా. పసిఫిక్ తీర ప్రాంతం నుంచి అట్లాంటిక్ తీరం వరకు మీ గ్రహణం వల్ల చీకటి పడటం చాలా అరుదైన విషయమంటూ మా శాస్త్రవేత్తలూ చెబుతున్నారు. ఎప్పుడో 1918లో ఇలాంటి గ్రహణం కనిపించిందట. మళ్లీ ఇన్నాళ్లకు ఇలా. అందుకే దీనికి 'గ్రేట్ అమెరికన్ ఎక్లిప్స్' అంటూ పేరూ పెట్టేశారు.

▶ అవును కిట్టూ. అమెరికా ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా వరకు 14 రాష్ట్రాల మీదుగా 98 కిలోమీటర్ల నుంచి 113 కిలోమీటర్ల మేర నాకు చంద్రుడు అడ్డొచ్చాడు. ఈ తతంగమంతా 2 గంటల 40 నిమిషాల పాటు జరిగింది. అందుకే ఆ ప్రాంతమంతా పట్టపగలే రెండు మూడు నిమిషాలు చీకటయ్యింది. అప్పుడు నా గ్రహణాన్ని చూడ్డానికి భారీ ఏర్పాట్లే జరిగాయనుకుంటా!

◆ అవునవును. సోమవారం అమెరికాలో అన్ని చోట్లా ఒకటే సందడి. అమెరికాలో కొన్ని చోట్ల పాక్షికంగా కనిపిస్తే కొన్ని రాష్ట్రాల్లో మాత్రం సంపూర్ణంగా గ్రహణం కనిపించింది. నేను నేరుగా చూడలేదు కానీ నాసా వాళ్లు అందించిన ప్రత్యేక ప్రసారాల్లో చూశా. విద్యార్థులకు అంతరిక్షం విషయాలు పుస్తకాల్లోనే తప్ప నిజంగా చూపించడానికి కుదరదు కదా. కానీ ఈ సందర్భంగా ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌ఫార్మల్ స్టెమ్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ లాంటివి పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. కళ్లకు హాని జరగకుండా ఉండేందుకు కళ్లజోళ్లు ఇచ్చి నేరుగా సూర్యగ్రహణాన్ని దగ్గరుండి చూపించాయి. కొన్ని మ్యూజియాల్లో వారి కోసం గ్రహణంపై తరగతులు నిర్వహించాయి. టెలిస్కోపులిచ్చి, దాంట్లోంచి గ్రహణాన్ని చూపిస్తూ వివరాలు చెప్పుకొచ్చాయి. ఇదంతా భలేగా సాగిపోయింది.

▶ శాస్త్రవేత్తలు కూడా చాలా ఆసక్తి చూపినట్టున్నారే!

◆ అవును మరి. అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా వారైతే మరీనూ. ఏదో రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ పెట్టినట్లు మీ గ్రహణానికీ పెట్టి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక చాలామంది శాస్త్రవేత్తలైతే ఆ సమయంలో మిమ్మల్నీ, చంద్రుడినీ టెలిస్కోపుల ద్వారా ఎంతో పరీక్షగా చూశారు. దాన్నుంచి వాళ్లు నేర్చుకునే విషయాలు మీపై చేసే పరిశోధనల్లో ఎంతో ఉపయోగపడతాయని చెబుతున్నారు వాళ్లు.

మరో విషయం చెప్పడం మరిచా. మీ గ్రహణాన్ని నేల మీద నుంచే కాదు. విమానాల్లోంచి, సముద్రంలో ఓడల మీద నుంచి కూడా చూశారు కొంత మంది. ఇక వస్తా సూర్యుడు గారూ! ఈ కబుర్లన్నీ మా వాళ్లకీ చెప్పాలి కదా!

▶ సరే కిట్టూ. బైబై మరి!

అందం చూసే కళ్లలో ఉండదు, సాయం చేసే చేతుల్లో ఉంటుంది

- అబ్దుల్ కలాం

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Protection = రక్షణ
- మనోజ్ఞం = అందం

నవ్వుల జల్లులు!

టీచర్: కళ్లు, ముక్కు, చెవులు ఎందుకు ఉపయోగపడతాయి?

బిట్టు: కళ్లద్దాలు పెట్టుకోవడానికి టీచర్!

- జి. వెంకట రమణ, తూర్పునాయుడుపాలెం

టీచర్: రాముా! పిల్లుల జాతికి చెందిన జంతువుల పేర్లు చెప్పు?

రాము: తల్లి పిల్లి, తండ్రి పిల్లి, పిల్లి పిల్లలు టీచర్!

- పి. నారాయణ, అనంతపురం

ప్రశ్నలోనే సమాధానం!

ఇక్కడున్న ఆంగ్ల పదాల్లోనే దాని పక్కనున్న తెలుగు పదాల సమానార్థకాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి.

1. Boxలో ఎద్దు
2. Beatలో తిను
3. Teamలో తేనీరు
4. Stageలో వయసు
5. Priceలో మంచు
6. Partలో కళ
7. Phoneలో ఒకటి
8. Earthలో చెవి

- ఎస్. మణెమ్మ, కాజీపేట

పట్టికలో పదాలు

P	F	I	E	S	P	D	T	B	N	L	P
C	E	T	U	J	T	H	R	I	I	N	Q
J	K	N	A	R	D	H	A	E	B	H	J
H	E	F	M	S	A	T	U	R	N	B	I
V	I	M	M	L	F	N	E	M	A	U	I
Y	G	F	E	N	O	T	U	H	N	Z	K
U	I	I	R	E	I	W	T	S	P	M	G
M	S	Q	C	P	H	C	R	W	M	E	F
A	P	L	U	T	O	A	M	S	E	L	A
S	O	J	R	U	M	M	D	E	A	R	M
D	I	A	Y	N	R	X	H	G	M	D	X
R	E	E	P	E	O	F	B	N	H	O	O

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

MERCURY, VENUS, EARTH, MARS, JUPITER, SATURN, URANUS, NEPTUNE

చుక్కలు కలపండి



చిలిపి ప్రశ్న

నూతిలో ఉన్న పది కప్పల్లో తొమ్మిది చచ్చిపోతే ఇంక ఎన్ని ఉంటాయి?

- జి. రమేష్, పెనుబర్తి

జవాబులు: **బొమ్మలో ఉన్నవే:** Xantus, Xerus, Xray, Xiphias, X ray fish **చిలిపి ప్రశ్న:** పదీ అందులోనే ఉంటాయి! **ప్రశ్నలోనే సమాధానం:** 1. Ox 2. Eat 3. Tea 4. Age 5. Ice 6. Art 7. One 8. Ear

---



బొమ్మలో ఉన్నవే

బొమ్మలో X ఆంగ్ల అక్షరంతో మొదలయ్యే అంశాలున్నాయి. అవేంటో పట్టుకుని గడుల్లో రాయగలరా?

X

ఆడపిల్లలపై వివక్ష మానుకోండి

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: నేటి కంప్యూటర్ యుగంలోనూ సమాజంలో ఆడపిల్లలపై వివక్ష చూపడం సరికాదని, ఈ పద్ధతిని ప్రతి ఒక్కరూ మానుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బాలల హక్కులు, బాలికల సంరక్షణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమే అన్నారు. సాఫ్ట్‌వేర్, అంతరిక్షం, ఆకాశయానం, రక్షణ రంగం, పోలీస్, బ్యాంకులు ఇలా పలు ప్రభుత్వ రంగాలతోపాటు ఐటీ, కార్పొరేట్, వివిధ ప్రైవేటు కంపెనీల్లోనూ. . ఒకరకంగా చెప్పాలంటే అన్ని రంగాల్లో మగవారి కంటే ఆడవాళ్లే చక్కగా రాణిస్తున్నారని ఆయన అన్నారు. ఇలాంటి సమయంలోనూ ఆడపిల్లలను తక్కువచేసి చూడటం సరికాదన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు ఆడపిల్లను భారంగా చూడకుండా కొడుకుతో సమానంగా పెంచాలన్నారు. గ్రామాల్లో ముఖ్యంగా బాలికలకు పదవ తరగతి అయిపోయిన వెంటనే పెళ్లి చేయాలని చూడడం బాధాకరమన్నారు. వారికి పూర్తిగా స్వేచ్ఛనిచ్చి ఉన్నత విద్యను చదివేలా ప్రోత్సహించాలన్నారు. ఆడపిల్లలకు 18ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. అంతకుముందు చేసిన తల్లిదండ్రులతో పాటు అందరు బాధ్యులవుతారన్నారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలను గ్రామాల్లో ఎక్కడైనా పనిలో పెడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమాని, తల్లితండ్రులు ఇద్దరు శిక్షార్హులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యనారాయణరావు, ఎంపీడీవో సుదాకర్‌రెడ్డి, ఎంవీ ఫౌండేషన్ అధికారి హన్మంతురెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: వ్యాపారాభివృద్ధికి బుధవారం గణపతిని ఎలా పూజించాలి?, చిత్రపటాలు అదృష్టాన్నిస్తాయా?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: సామాన్యుడు (జగపతిబాబు, కామ్నజెఠ్మాలని).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': మసాలా వంటలు 'చికెన్ మంచూరియా', 'కీమాఫ్రై', కారం కారంగా 'క్రాబ్స్‌పెప్పర్‌ఫ్రై', చెఫ్స్ స్పెషల్ 'ప్రాన్స్‌పకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఢీ 10: సూపర్ డాన్సుల సుప్రీమ్ షో...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 మహాతల్లి రిపీట్

01:15 ఫ్రూట్స్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 నా షో నా ఇష్టం

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)

★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)

★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)

★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)

★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ. 9:30, సా. 4:00)

★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (ఉ. 10:00)

★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)

★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (మ. 2:00, రా. 7:00)

★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (మ. 2:30, రా. 09:30).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: జీవనజ్యోతి (జయసుధ), 10-00: మార్నింగ్ షో: భార్యాభర్తల బంధం (బాలకృష్ణ, రజని), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ముద్దుగోపాలుడు (బాలకృష్ణ, విజయశాంతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: జనం (సాయికుమార్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దలు మారాలి (కృష్ణ, జమున), 10-00 సెకండ్ షో: అగస్టు 15 రాత్రి (అర్జున్, గౌతమి).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ శాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ బేసిల్ క్రేప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – వెన్న చెక్కలు & మొక్కజొన్న బూరెలు, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – టమోట కోకోనట్ సూప్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (వృద్ధ వయసు వారికోసం) – క్యాబేజి చట్నీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - వంకాయ పప్పు & వంకాయ రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - పటిస్టప (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఆలూ పన్నీర్ బైట్స్, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - దొండకాయ చట్నీ అవకాడో చపాతీ రోల్, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - బట్టర్ గార్లిక్ పెప్పర్ ప్రాన్స్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్)– జపనీస్ ఫిష్ సూప్ & ప్రాన్స్ అండ్ ఫిష్ క్యాబేజి, మ.1.30, రా.10.00: చటపట (అత్తమ్మ రుచుల స్పెషల్) - స్ప్రౌట్స్ గోకరకాయ కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్స్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – సెజ్వాన్ చిల్లీ నూడుల్స్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ విత్ ఎగ్ ఫ్రై, మ.3.00: పదండి విందుకు – ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.5.15: స్నాక్స్ - బ్రెడ్ దహీ వడ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ పద్మనాభ స్వామి ఆలయం, పద్మనాభం, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి(రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీహరిహరక్షేత్రం, కర్మన్‌ఘాట్, హైదరాబాద్, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీ భవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 23-08-2017

ఎస్వీబీసీ (TTD): **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (సహస్ర కలశాభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - వినాయకుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు-కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కళ్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టగణపతితత్వం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 భక్తి చైతన్యం, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - త్రివిక్రమాలయం, 09-30 దేవీసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీవిష్ణు సహస్రం, 06-30 గోవింద నామాలు, 7-00 అర్చన, 7-30 శ్రీవేంకటేశ్వరస్తోత్రం, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 వినాయక వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీవేంకటేశ్వరస్తోత్రం, 05-30 గోవిందనామాలు, 06-00 శ్రీవిష్ణుసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 గణేశాయ నమః. 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 గోపురం, 08-00 సినిమా: భీమవరం బుల్లోడు, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: జై చిరంజీవా.

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: సీతారామరాజు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: పెళ్ళిసందడి, **సాయంత్రం:** 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలిషాపింగ్ 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: శీను, 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి 02-30 నాగిని 2 రిపీట్, 03-00 సినిమా: గోలిమార్, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: కరెంట్ తీగ.

HBO: **ఉదయం:** 06-16 ప్యాసింజర్ 57, 07-43 ఫైనల్ డెస్టినేషన్ 5, 09-25 ఫూల్స్ గోల్డ్, 11-28 స్టెప్ అప్, **మధ్యాహ్నం:** 01-21 ది తక్సెడో, 03-03 జాక్ ది జయింట్ స్లేయర్, **సాయంత్రం:** 05-11 ఘోస్ట్ రైడర్: స్పిరిట్ ఆఫ్ వెంగెన్స్, 06-55 10000 బీసీ, **రాత్రి:** 09-00 గెట్ స్మార్ట్, 11-03 ఘోస్ట్ షిప్.

అధిక వర్షాలు - పైర్లలో జాగ్రత్తలు

రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వివిధ పంటల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, అపరాల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఖమ్మం ఏరువాక సెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

పత్తి పంటలో... : ★ సాధ్యమైనంత వరకు చేలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు నీటిని మురుగు కాల్వలు ఏర్పాటు చేసుకొని తీసివేయాలి.

★ వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించుకోటానికి అంతర సేద్యం చేయాలి. ★ అంతర సేద్యం చాలా రోజుల వరకు వీలుకాకపోతే కలుపు సమస్య ఎక్కువగా ఉంటే విత్తిన 45-60 రోజుల పైరులో ఎకరాకు 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ + పైరిథయోబాక్ సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలి. ★ వర్షాలు తగ్గిన వెంటనే బురద పదునులో ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. విత్తేటప్పుడు భాస్వరం వేయని రైతులు ఎకరానికి 50 కిలోల డీఏపీని విత్తిన 20-25 రోజుల సమయంలో వేసుకోవాలి. ★ అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి, మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి.



మొక్కజొన్నలో...: ★ మొక్కజొన్న అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేయటం ద్వారా తేమను తగ్గించుకోవాలి. ★ చేలో నిల్వ వర్షపు నీటిని కాల్వలు బోదెల ద్వారా ఎప్పటికప్పుడు తీసివేయాలి. ★ తేమ ఎక్కువగా ఉన్న మొక్కజొన్న పొలంలో ఎకరాకు 25 కిలోల యూరియా + 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కల మొదళ్ల దగ్గర వేసుకుంటే కొంతవరకు తేమ ఒత్తిడిని తట్టుకుంటుంది. ★ మొక్కజొన్నలో అంతరకృషి ఆలస్యమైతే, కలుపు నివారణకు టిమ్‌బొట్రియాన్(లాడిన్) కలుపు మందును ఎకరాకు 115 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అపరాలు, మిరపలో...: ★ పెసర, మినుము పైర్లలో పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉన్నందున, ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ 20-25 రోజుల దశలో ఉన్న పెసర, మినుము పైర్లలో కలుపు అధికంగా ఉంటే.. అంతరసేద్యం వీలుకానప్పుడు ఇమజిథాపిర్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో 200 మి.లీ. కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చెయ్యాలి. ★ వర్షాలకు అపరాల పంటలకు ఆకుమచ్చ తెగులు ఆశించే ప్రమాదం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. ★ మిరప నారుమళ్లలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

★ అధిక వర్షాలకు మిరప నారుకు నారుకుళ్లు ఆశిస్తే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2, 3 సార్లు నారుమళ్లను తడపాలి.

–న్యూస్‌టుడే, ఖమ్మం (వ్యవసాయం)

సీతాఫలం సాగు వివరాలు

సీతాఫలం ఎక్కువ వర్షపాతాన్ని, వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. చౌడు, క్షార నేలల్లో తప్ప అన్ని నేలల్లో సాగు చేయవచ్చు. మురుగునీరు పోయే సదుపాయం కలిగిన చల్కా, గరప, ఎర్ర నేలలు, రాళ్లతో కూడిన కంకర నేలలు కూడా అనుకూలమే.

✦ 60×60×60 సెం.మీ. పరిమాణంలో 5×5 మీటర్ల దూరంలో గుంతలు తవ్వాలి. ఒక్కో గుంతకు 20 కిలోల పశువుల ఎరువు, కిలో సూపర్‌ఫాస్ఫేట్, 100 గ్రా. ఫాలిడాల్‌ను పొడిగుంత నుంచి తీసిన పైపొర మట్టిలో కలిపి గుంతను నింపాలి. అంటు మొక్కలను గుంత మధ్యలో నాటాలి. నాటేటప్పుడు అంటుభాగం భూమికి 15-20 సెం.మీ. పైకి ఉండేలా నాటి, మొక్కకు ఊతంగా కర్రను ఏర్పాటు చేయాలి. అంటు మొక్కల వేరుమూలంపై వచ్చే చిగుళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. సీతాఫలంలో లేత కొమ్మల మీద పూత వస్తుంది. కనుక తక్కువ స్థాయిలో కొమ్మల కత్తిరింపు చేస్తే లేత కొమ్మలు, పూత బాగావచ్చి ఎక్కువ దిగుబడి వస్తుంది. కత్తిరింపు జనవరి-మార్చి మాసాల్లో, ఆకురాల్చే సమయంలో చేయాలి.

✦ మొక్కలు నాటిన తర్వాత అవసరాన్ని బట్టి 2-3 రోజులకు ఒకసారి నీరు పారించాలి. నీరు తక్కువైతే కాయలు గట్టిగా మారి త్వరగా పండుబారతాయి. బెట్టలో మొక్కల మొదళ్లలో వరిపొట్టు, వేరుసెనగ పొట్టులాంటివి వేసి పాదుల్లో తేమను నిలుపుకోవచ్చు.

✦ కాపులో ఉన్న ఒక్కో చెట్టుకు 50 కిలోల పశువుల ఎరువు, కిలో ఆముదపు పిండి, కిలో ఎముకల పొడిని మొదళ్ల చుట్టూ గాడిచేసి జూన్-జులై మాసాల్లో వేయాలి. వీటితోపాటు 250 గ్రా. నత్రజని, 125 గ్రా. భాస్వరం, 125 గ్రా. పొటాష్ వేసుకోవచ్చు.